

# విభారే

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY


ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి
రి.నెం. 119/2015
ఆళ్ళగడ్డ, కర్నూలు జిల్లా
ఉచిత కళ్యాణ మండపం
స్వయం ఉపాధి శిక్షణ
ఉచిత రక్తదానము
ఉచిత న్యాయ సలహాలు
ఉచిత కంప్యూటర్ శిక్షణ
సంప్రదించవలసిన చిరునామా
ఆవుల విజయభాస్కర రెడ్డి
ఆళ్లగడ్డ
9440232308,9494498787



PUBLISHED FROM KURNOOL ఎడిటర్: ఆవుల విజయ భాస్కర్ రెడ్డి గురువారం 07 ఏప్రిల్ 2022 సంపుటి : 03 సంచిక : 204 పేజీలు : 4 వెల : రూ 3-00


## పల్నాడు జిల్లా కేంద్రంలో
# సీఎం జగన్ పర్యటన



అమరావతి: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలో పర్యటించనున్నారు. ఉదయం 10 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి బయలుదేరి 10.35 గంటలకు నరసరావుపేటలోని ఎస్‌ఎస్‌ఎన్ కాలేజ్ గ్రౌండ్స్‌కు చేరుకుంటారు. 10.50 గంటలకు పీఎన్‌సీ కాలేజీ వద్ద కాసు వెంగళరెడ్డి విగ్రహావిష్కరణ చేయనున్నారు. అనంతరం 11.00 గంటలకు స్టేడియం వద్దకు చేరుకుని బహిరంగ సభలో పాల్గొంటారు. అదే వేదికపై వలంటీర్లను సత్కరించి ప్రోత్సాహకాలు అందించనున్నారు సీఎం జగన్. తిరిగి 12.35 గంటలకు నరసరావుపేట నుంచి బయలుదేరి తాడేపల్లి నివాసానికి చేరుకుంటారు. ఇదిలా ఉండగా.. ఉమ్మడి గుంటూరు జిల్లాను గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలుగా ప్రకటించిన విషయం తెలిసిందే. పల్నాడు జిల్లా కేంద్రంగా నరసరావుపేటలో ఇప్పటికే జిల్లా పాలనా యంత్రాంగం పనులు ప్రారంభించింది కూడా.

# దేశంలో రెండు రకాల రాజకీయాలున్నాయి : మోదీ



న్యూఢిల్లీ : దేశంలో రెండు రకాల రాజకీయాలు ఉన్నాయని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. బీజేపీ 42వ వ్యవస్థాపక దినోత్సవాల సందర్భంగా బుధవారం ఆయన వర్చువల్ విధానంలో మాట్లాడుతూ, కుటుంబ భక్తి రాజకీయాలు, దేశ భక్తి రాజకీయాలు మన దేశంలో ఉన్నాయని చెప్పారు. నాలుగు రాష్ట్రాల్లో అధికారాన్ని నిలుపుకోవడంతోపాటు రాజ్యసభలో బీజేపీ ఎంపీల సంఖ్య 100కు చేరిందని, ఈ తరుణంలో ఈ వేడుకలను జరుపుకుంటున్నామని చెప్పారు. బీజేపీ 42వ వ్యవస్థాపక దినోత్సవాల సందర్భంగా నేడు మనం జన సంఘ్ శకాన్ని గుర్తు చేసుకోవాలన్నారు. ఆ రోజుల్లో నూనె దీపాలను పట్టుకుని నడిచినవారిని, ఆ తర్వాత కమలంతో నడుస్తున్నవారిని గుర్తు చేసుకోవాలన్నారు. పార్టీని వైభవోపేతంగా తీర్చిదిద్దడం కోసం మూడు, నాలుగు తరాలవారు తమ జీవితాలను అంకితం చేశారని చెప్పారు. ఏ పార్టీ ప్రభుత్వమైనా దేశం కోసం ఏదీ చేయరనే భావన ప్రజల్లో ఉండేదన్నారు. గతంలో ఈ నైరాశ్యం ఉండేదని చెప్పారు. నేడు దేశం మారుతోందని, వేగంగా ముందుకు వెళ్తోందని ప్రతి పౌరుడు గర్వంగా చెబుతారన్నారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో భారత దేశ వైఖరిని ప్రస్తావిస్తూ, నేడు భారత దేశం ప్రపంచం ముందు దృఢంగా నిలిచిందన్నారు. ఎటువంటి భయం, ఒత్తిడి లేకుండా తన ప్రయోజనాల కోసం భారత దేశం దృఢ వైఖరిని ప్రదర్శిస్తోందని చెప్పారు. ఉక్రెయిన్‌పై యుద్ధం నేపథ్యంలో కొందరు విదేశీ నేతలు న్యూఢిల్లీలో పర్యటించి, భారత దేశం జోక్యాన్ని కోరిన సంగతి తెలిసిందే. యావత్తు ప్రపంచం రెండు శత్రు వర్గాలుగా విడిపోయిన నేపథ్యంలో ప్రపంచం దృష్టిలో భారత దేశం మానవత్వం గురించి దృఢంగా మాట్లాడగలిగే దేశంగా ఉందని మోదీ చెప్పారు. న్యూఢిల్లీలోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో జరుగుతున్న వ్యవస్థాపక దినోత్సవాలకు వివిధ దేశాల దౌత్యవేత్తలను కూడా బీజేపీ ఆహ్వానించింది. దేశవ్యాప్తంగా రక్తదాన శిబిరాలను నిర్వహించింది.

## విజయవాడ మునిసిపల్ కమిషనర్ గా
# సప్నిల్ దినకర్ పుండ్కర్

విజయవాడ విజయవాడ నగరపాలక సంస్థ నూతన మున్సిపల్ కమిషనర్ గా సప్నిల్ దినకర్ పుండ్కర్ ప్రమాణ స్వీకారం చేశారు. ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు విజయవాడ నగర మున్సిపల్ కమిషనర్ గా ప్రమాణ స్వీకారం చేయడం ఎంతో సంతోషకరమైన విషయమని తెలిపారు. గతంలో తాను కాకినాడ టౌన్ కమిషనర్గా పనిచేశానని అక్కడి నుండి ఇక్కడికి బదిలీ చేయడం పై హర్షమ్ వ్యక్తపరిచారు. మరిముఖ్యంగా తనకు విజయవాడకు ఎంతో అవినాభావ సంబంధం ఉందని గతంలో నూజివీడు సబ్ కలెక్టర్గా కూడా తాము విధులు నిర్వర్తించాలని తెలిపారు. మరీ ముఖ్యంగా విజయవాడ నగర వ్యాప్తంగా ఉన్న అక్రమ కట్టడాలపై స్పందిస్తూ గతంలో కాకినాడ పట్టణంలో ఏ విధంగా అయితే స్పెషల్ డిమాలిష్ టీమ్ ను ఏర్పాటు చేసి అక్రమకట్టడాల నియంత్రణ కోసం ఏ విధంగా అయితే పనిచేసామని అన్నారు. అదేవిధంగా విజయవాడ అటో నగర్ నగర వ్యాప్తంగా కూడా ప్రత్యేకంగా దిమాలిష్ టీమ్ ఏర్పాటు చేయడం లేక ప్రత్యేక టాస్కోర్స్ ఏర్పాటు చేయడమా అనే విషయంపై సంబంధిత అధికారులతో చర్చించి చి రాబోయే కొన్ని రోజుల్లో తుది నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే అత్యంత పెద్దదైన విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ గా పని చేయడం తనకెంతో సంతోషంగా ఉందని తెలిపారు

## కేంద్ర హోంమంత్రి
# అమిత్‌షాతో సీఎం జగన్ భేటీ



ఢిల్లీ: కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భేటీ అయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన కీలక అంశాలపై చర్చించారు. సీఎం జగన్ మంగళవారం తన ఢిల్లీ పర్యటనలో భాగంగా తొలుత ప్రధాని నరేంద్ర మోదీతో భేటీ అయ్యారు. ప్రధానితో గంటకు పైగా సాగిన సమావేశంలో రాష్ట్రానికి సంబంధించి పలు కీలక అంశాలపై చర్చించారుపోలవరం ప్రాజెక్టు, కడప స్టీల్ ప్లాంట్, జాతీయ ఆహార భద్రతా చట్టం అర్హుల ఎంపికలో హేతుబద్ధత, తెలంగాణ డిస్కంల నుంచి రాష్ట్రానికి బకాయిలు తదితర అంశాలను ప్రధానికి సీఎం నివేదించారు. ముఖ్యమంత్రి నివేదించిన అంశాల పట్ల ప్రధాని సానుకూలంగా స్పందించారు. అనంతరం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో సీఎం భేటీ అయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన కీలక అంశాలపై చర్చించారు.

కేంద్ర జలశక్తి మంత్రితో సీఎం జగన్ భేటీ

కేంద్ర ఆర్థిక మంత్రితో భేటీ అనంతరం కేంద్ర జలశక్తి మంత్రి షెకావత్‌తో సీఎం జగన్ భేటీ అయ్యారు. పోలవరం ప్రాజెక్ట్‌పై ప్రధానంగా చర్చించారు. 45 నిమిషాల పాటు సమావేశం కొనసాగింది. పోలవరం ప్రాజెక్ట్ త్వరితగతిన నిర్మాణం, డిజైన్ల ఆమోదంపై చర్చించారు. కాఫర్ డ్యామ్ ఈసీఆర్ఎఫ్ డిజైన్లకు ఇప్పటికే జలశక్తిశాఖ ఆమోదం తెలిపింది.



# కేంద్రమంత్రి నితిన్ గడ్కరీతో ముఖ్యమంత్రి భేటీ



న్యూఢిల్లీ కేంద్రమంత్రి నితిన్ గడ్కరీతో ముఖ్యమంత్రి వైయస్.జగన్ సమావేశమయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన కీలక రోడ్డు ప్రాజెక్టులపై చర్చించారు. విశాఖ? భోగాపురం బీచ్ కారిడర్ ప్రాజెక్ట్కు సంబంధించి మరిన్ని మేలైన ఆలోచనలు చేయాలంటూ గత రాష్ట్ర పర్యటనలో గడ్కరీ ఇచ్చిన సలహామేరకు... అధికారులు ఆ ప్రయత్నాల్లో ఉన్నారని వివరించిన సీఎం. విశాఖనుంచి వేగంగా భోగాపురం చేరేందుకు సౌకర్యవంతమైన రోడ్డుతోపాటు, పర్యాటకరంగానికి ఊతమిచ్చేలా ఈ ప్రాజెక్టును తీర్చిదిద్దడానికి తగిన సహాయ సహకారాలు అందించాలని కోరారు. విజయవాడ వెస్ట్రన్ బైపాస్ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయని, దీనికి సీఆర్డీయే గ్రిడ్ రోడ్డును అనుసంధానం చేసి పనులు ముందుకుసాగేలా చర్యలు తీసుకోవాలని సీఎం కోరారు. విజయవాడ వెస్ట్రన్ బైపాస్కు సంబంధించి మల్టీమోడల్ లాజిస్టిక్ పార్కు భూములు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సంసిద్ధంగా ఉందని, ఈ భూములను కూడా గుర్తించిందని వెంటనే డీపీఆర్ సిద్ధంచేసి పనులు ముందుకు తీసుకెళ్లాలని కోరారు. విజయవాడ ఈస్ట్రన్ బైపాస్కు సంబంధించి కూడా డీపీఆర్ సిద్ధంచేసి పనులు వేగవంతంగా చేపట్టేలా తగిన చర్యలు తీసుకోవాలి. రాష్ట్రంలో 20 ఆర్వోబీలకు కేంద్ర ఉపరితల రవాణాశాఖ ఇప్పటికే మంజూరుచేసిందని, మిగిలిన 17 ఆర్వోబీలనూ మంజూరుచేయాలని విజ్ఞప్తిచేసారు. రాష్ట్రంలోని వివిధ పర్యాటక ప్రాంతాలను, పారిశ్రామిక నోడళ్లను, స్పెషల్ ఎకనమిక్ జోన్లను కలుపుతూ 1723 కిలోమీటర్ల మేర జాతీయ రహదారుల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరిన సీఎం. కొత్త ఏర్పడ్డ జిల్లాల కేంద్రాలను కలుపుతూ ఈ రోడ్ల నిర్మాణం చేపట్టాలని విజ్ఞప్తిచేసారు. రాష్ట్రంలో దాదాపు 14 ప్రాంతాల్లో రోప్ వే ల నిర్మాణానికి పర్యాటక శాఖ ప్రతిపాదనలు పంపించింది. ఇప్పటికే 2 చోట్ల నిర్మాణానికి అంగీకరించింది. మిగిలిన ప్రతిపాదనలకూ అనుమతి మంజూరుచేయాలని కేంద్రమంత్రి గడ్కరీని కోరారు.

## 'మాది సంక్షేమ ప్రభుత్వం.. గర్వంగా చెప్పగలం'



అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఉద్యోగుల పట్ల ప్రేమ ఉండబట్టే 27 శాతం ఐఆర్ ఇచ్చారని.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి వల్లే పీఆర్సీపై ఉద్యోగులతో సంప్రదింపులు చేయాల్సి వచ్చిందని మంత్రి పేర్నినాని తెలిపారు. వాణిజ్య పన్నుల శాఖ సర్వీసెస్ అసోసియేషన్ సర్ణోత్సవ వేడుకల్లో ఆయన మాట్లాడుతూ 50 ఏళ్లగా ఒక్కటే యూనియన్‌గా నడపటం అభినందనీయమన్నారు. తమ వెంట నడిచిన ఉద్యోగులను ఎప్పటికీ గుర్తించుకుంటామని చెప్పారు. ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ మాట్లాడుతూ.. దేశంలోనే ఏపీ వాణిజ్య పన్నుల శాఖ ఉన్నత స్థితిలో ఉందని, వాణిజ్య పన్నుల శాఖకు సీఎం వైఎస్ జగన్ పూర్తి సహకారం అందించారన్నారు. 2019లో వైఎస్సార్‌సీపీ భారీ మెజార్టీ రావడంలో ఉద్యోగుల పాత్ర కీలకమని కొనియాడారు. తమ ప్రభుత్వం సంక్షేమ ప్రభుత్వం అని గర్వంగా చెప్పగలమన్నారు. ఉద్యోగుల సహకారంతోనే రాష్ట్ర అభివృద్ధి జరిగిందన్న ఆయన.. ఉద్యోగుల సంఘ నాయకుడిగా సూర్యనారాయణ మంచి పనితీరు కనబరిచారని ప్రశంసించారు. రెండు, మూడు దశాబ్దాలుగా ఎన్నికల సమయంలో హామీలు ఇవ్వడం తర్వాత మర్చిపోవడం ఒక ట్రెండ్‌గా వస్తోందని, సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం ఉద్యోగుల సంక్షేమం, అభివృద్ధిని ప్రజా సంక్షేమంతో కలిసి చూస్తోందని ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. అడగకుండానే ప్రభుత్వం 27 శాతం ఐఆర్ ఇచ్చిందన్న ఆయన.. ఇవ్వగలం అనే ఉద్దేశ్యంతోనే సీపీఎస్ రద్దు వంటి హామీలు ఇచ్చామని, కానీ కోవిడ్ కారణంగా రాష్ట్ర ఆదాయం పై తీవ్ర ప్రభావం చూపించిందని చెప్పారు. ఉద్యోగుల సంక్షేమం చూడటం బాధ్యతగా భావిస్తామని సజ్జల అన్నారు.

# కాంట్రాక్ట్ టీచర్లను రెగ్యులరైజ్ చేయండి

## రాజ్యసభలో ప్రభుత్వానికి విజయసాయి రెడ్డి విజ్ఞప్తి



న్యూఢిల్లీ, ఏప్రిల్ 6 కాంట్రాక్ట్ పద్ధతిపై పని చేస్తున్న టీచర్ల సర్వీసును రెగ్యులరైజ్ చేయాలని వైఎస్సార్సీపీ సభ్యులు వి.విజయసాయి రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం రాజ్యసభ జీరో ఆవర్‌లో ఆయన కాంట్రాక్ట్ టీచర్ల సమస్యను లేవనెత్తారు. కాంట్రాక్ట్ పద్ధతిపై టీచర్లను నియమించే ప్రక్రియ రానురాను తీవ్ర సమస్యాత్మకంగా మారిందని అన్నారు. మొదట్లో టీచర్ల కొరతను అధిగమించేందుకు ప్రత్యేక సందర్భాలలో మాత్రమే కాంట్రాక్ట్ పద్ధతిపై టీచర్ల నియామకాలు జరిగేవి. తర్వాత కాలంలో ఇది ప్రాక్టీసుగా మారిపోయిందని ఆయన అన్నారు. ప్రస్తుతం దేశంలో 6.5 లక్షల మంది కాంట్రాక్ట్ టీచర్లు ఉన్నారు. అంటే దేశంలోని మొత్తం టీచర్ల సంఖ్యలో 13 శాతం మంది కాంట్రాక్ట్ టీచర్లే. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో నిరుపేదలు, బడుగు బలహీనవర్గాల విద్యార్థులు అధిక శాతం చదివే స్కూళ్ళలో కాంట్రాక్ట్ టీచర్ల సంఖ్య 41 శాతానికి చేరుకుంది. కేవలం అయిదేళ్ళ వ్యవధిలో దేశ విద్యా రంగంలో లక్ష మంది కాంట్రాక్ట్ టీచర్ల నియామకం జరిగిందని శ్రీ విజయసాయి రెడ్డి పేర్కొన్నారు. కాంట్రాక్ట్ టీచర్ల నియామకం తాత్కాలిక ప్రాతిపదికపైన జరుగుతుంది. రెగ్యులర్ టీచర్ల మాదిరిగా వారికి సర్వీసు ప్రయోజనాలు ఉండవు. ఉద్యోగ భద్రత లేదు. అతి తక్కువ వేతనాలతో పని చేస్తుంటారని ఆయన చెప్పారు. ఈ కారణాల వలన కాంట్రాక్ట్ టీచర్లలో నానాటికీ అసంతృప్తి పెరుగుతుంది. ఆర్థిక సమస్యల వత్తిడి కారణంగా బోధన పట్ల వారిలో ప్రేరణ కొరవడుతుందని శ్రీ విజయసాయి రెడ్డి అన్నారు. దేశంలో టీచర్ల సంక్షేమం నిర్లక్ష్యానికి గురవుతున్న కారణంగా విద్యారంగంలోకి ప్రతిభావంతులైన టీచర్లను ఆకర్షించలేకపోతున్నాం. ఫలితంగా విద్యా బోధనలో నాణ్యత సన్నగిల్లుతోందని అన్నారు. గురు బ్రహ్మ, గురు విష్ణు, గురుదేవో అంటూ భారతీయ సంస్కృతిలో గురువును దైవంతో సమానంగా పరిగణిస్తాం. కానీ టీచర్లం దరినీ సమదృష్టితో చూడలేకపోతున్నాం.

# ఏపీ ప్రభుత్వం ఇచ్చిన నోటీసుకు గట్టి రిప్లై ఇచ్చిన ఏబీ వెంకటేశ్వరరావు

అమరావతి: మీడియా సమావేశం నిర్వహణపై రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన నోటీసుకు ఏబీ వెంకటేశ్వరావు గట్టి రిప్లై ఇచ్చారు. వ్యక్తిత్వ దూషణలు, ఆరోపణలపై స్పందించే అవకాశం ఆలిండియా సర్వీస్ రూల్స్ కల్పించాయన్నారు. తనకు ఇచ్చిన నోటీసులోనే పేర్కొన్న.. రూల్ 17 నియమానికి అనుగుణంగానే తాను మీడియాతో మాట్లాడినట్లు ఏబీ తెలిపారు. తాను ఇంటలిజెన్స్ చీఫ్‌గా ఉండగా పెగాసస్ సాఫ్ట్ వేర్ వినియోగించలేదని మాత్రమే చెప్పానని ఆ లేఖలో వివరించారు. ఆలిండియా సర్వీస్ రూల్స్ 6 ప్రకారం అధికారిక అంశాలపై స్పష్టత ఇచ్చే అవకాశం ఉందన్నారు. రూల్ నెంబర్ 3 ప్రకారం అధికారులు పారదర్శకంగా, జవాబుదారీ తనంగా ఉండాలని, ప్రభుత్వ నిర్ణయాలను విమర్శించకూడదని మాత్రమే రూల్స్ చెపుతున్నాయన్నారు. మీడియా సమావేశంలో ప్రభుత్వాన్ని ఎక్కడా విమర్శించలేదని స్పష్టం చేశారు. గౌరవానికి భంగం కలిగించేలా తనపై, తన కుటుంబంపై ఆరోపణలు చేస్తే స్పందించకుండా ఎలా ఉంటానన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం లభించిన ప్రాథమిక హక్కు మేరకు వ్యక్తిగత ఆరోపణలపై వివరణ ఇచ్చానని స్పష్టం చేశారు. మీడియా సమావేశం పెడుతున్న విషయాన్ని ముందుగానే ప్రభుత్వానికి తెలిపానని, విజయసాయిరెడ్డి తనపై చేసిన ట్వీట్‌ను కూడా వివరణలో పేర్కొన్నట్లు ఏబీ వెంకటేశ్వరరావు తెలిపారు.

# ఎంట్రన్స్ టెస్టులు తేదీలు విడుదల

విజయవాడ, ఏప్రిల్ 6, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రంలోని వివిధ ప్రవేశ పరీక్షలకు సంబంధించిన షెడ్యూల్ విడుదల చేసింది. ఉన్నత విద్యనభ్యసించేందుకు ఎదురుచూస్తున్న విద్యార్థులు ఆయా సంబంధిత ప్రవేశ పరీక్షలు ఎప్పుడెప్పుడు నిర్వహించనుందో అధికారికంగా ప్రకటించింది. ఈఏపిసెట్, ఎడ్ సెట్, లాసెట్, పీజీఎల్ సెట్, పీజీఈసెట్, ఈసెట్, ఐసెట్ ప్రవేశపరీక్షల తేదీలను ఏపీ ఉన్నత విద్యా మండలి ప్రకటించింది. జూలై 4 నుంచి 12 వరకు ఈఏపీసెట్ నిర్వహించనున్నట్లు తెలిపింది. అలాగే.. జూలై 13న ఎడ్ సెట్, లాసెట్, పీజీ ఎల్ సెట్.. జూలై 18 నుంచి 21 వరకు పీజీ ఈసెట్, జూలై 22న ఈసెట్, జూలై 25న ఐసెట్ నిర్వహించనున్నట్లు ప్రకటించింది.

# సంపాదకీయం

గురువారం 07 ఏప్రిల్ 2022

## ఆర్థిక, రాజకీయ సంక్షోభంతో శ్రీలంక

శ్రీలంకలో ఆర్థిక సంక్షోభానికి తాజాగా రాజకీయ సంక్షోభం తోడైంది. ప్రజాగ్రహం నేపథ్యంలో క్యాబినెట్ మంత్రులందరూ మూకుమ్మడి రాజీనామా చేశారు. రాజీనామా చేసిన మంత్రుల్లో ప్రధాన మంత్రి కొడుకు నమల్ రాజపక్స కూడా ఉన్నారు. దేశంలో రాజకీయ సుస్థిరతకు తన రాజీనామా తోడ్పడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు. అయితే ప్రధాని మహింద్రా రాజపక్స మాత్రం రాజీనామా చేయలేదు. మరోవైపు శ్రీలంక సెంట్రల్ బ్యాంకు గవర్నర్ కూడా తన పదవికి రాజీనామా చేశారు.ప్రధాని మహింద్రా రాజపక్సతో పాటు ఆయన కుటుంబ సభ్యులంతా తమ పదవులకు రాజీనామా చేయాలని నిరసనకారులు డిమాండ్ చేస్తున్నారు. తాజా పరిణామాల నేపథ్యంలో దేశంలోని చాలా ప్రాంతాల్లో కర్ఫ్యూ అమలులో ఉంది. కర్ఫ్యూతో పాటు సోషల్ మీడియాపై కూడా ఆంక్షలు విధించారు. 1948లో స్వాతంత్ర్యం పొందిన తర్వాత ఇంత దారుణమైన సంక్షోభాన్ని శ్రీలంక ఇప్పటి వరకు చూడలేదు.రాజకీయ సంక్షోభం ముదురటంతో అధ్యక్షుడు గోటబాయ రాజపక్స అఖిల పక్ష సమావేశానికి పిలుపునిచ్చారు. సంక్షోభ పరిష్కారానికి అన్ని పార్టీలు కలిసి రావాలని అధ్యక్షుడు పిలుపు ఇచ్చారు. కొత్త మంత్రివర్గాన్ని ఏర్పాటు చేసే ప్రయత్నంలో భాగంగా ఆయన ప్రతిపక్ష పార్టీలకు లేఖలు రాశారు. మంత్రివర్గంలో చేరాలని ఆ లేఖలో పేర్కొన్నారు. అయితే ప్రతిపక్షాలు మంత్రివర్గంలో చేరి కోరి కోరి ప్రజాగ్రహానికి గురికావాలని అనుకుంటాయా?మరోవైపు తాజాగా నలుగురు కొత్త మంత్రులను నియమించినట్టు శ్రీలంక అధ్యక్ష కార్యాలయం ప్రకటించింది. పూర్తి క్యాబినెట్ కొలువుదీరే వరకు పార్లమెంటు కార్యక్రమాలు స్తంభించకుండా ఉండేందుకు వారిని నియమించినట్టు ఆ ప్రకటనలో పేర్కొంది.అధ్యక్ష భవనం ఎదుట నిరసన ప్రదర్శనలు హింసాత్మకంగా మారడంతో దేశ వ్యాప్తంగా అది మరింత దిగజారకుండా శుక్రవారం ఉదయం దేశంలో అత్యవసర పరిస్థితి విధిస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. ప్రజలకు రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణ, అత్యవసర సరకులు, సేవల నిర్వహణ కోసం ఎమర్జెన్సీ నిర్ణయం తీసుకున్నట్టు ప్రకటనలో పేర్కొంది. వాస్తవానికి, ఎమర్జెన్సీ విధింపునకు ముందే పలుచోట్ల నిరసన కారులను అదుపు చేసేందుకు కర్ఫ్యూ అమలులో ఉంది.ఇదిలా ఉంటే.. ఆర్థిక సంక్షోభం కారణంగా దేశంలో నిత్యావసరాలు కొరత తీవ్రరూపం దాల్చటంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఆహారం, మందులు, చమురు ధరలు భయంకరంగా పెరిగిపోయాయి. కనీసం బిడ్డకు పాలు కూడా కొనలేనంతగా పరిస్థితులు దిగజారాయి. విదేశీ మారక ద్రవ్యం కొరతతో చమురు దిగుమతులకు చెల్లింపులు జరపలేని దుస్థితి నెలకొంది.దేశంలో రోజుకు ఏకంగా 13 గంటల విద్యుత్ కోతలు విధిస్తున్నారు. దాంతో ప్రజలు ప్రత్యక్ష నరకం అనుభవిస్తున్నారు. జనజీవనం అస్తవ్యస్తంగా మారటంతో ప్రజాగ్రహం కట్టలు తెంచుకుంది. ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ అందరూ రాజీనామా చేయాలంటూ జనం వీధుల్లోకి వచ్చారు. కొందరు నిరసనకారులు గురువారం రాత్రి అధ్యక్ష భవనాన్ని ముట్టడించారు. దాంతో అది హింసాత్మకంగా మారింది.దేశంలో రాజపక్స ప్రజాదరణ తగ్గిందనటానికి ప్రస్తుత ప్రజాగ్రహమే నిదర్శనం. స్థిరమైన పాలన అందిస్తానంటూ 2019లోఅత్యధిక మెజార్టీతో అధికారంలోకి వచ్చిన ఆయన తరువాత విపరీతమైన బంధుప్రీతిని ప్రదర్శించారు. మంత్రి వర్గాన్ని కుటుంబ సభ్యులతో నింపి వేశారు. పలు కీలక శాఖలను సోదరులు, మేనల్లుడికి అప్పగించారు. దాంతో పాలన పూర్తిగా అవినీతిమయమైంది.ఓ వైపు జనం కరెంటు లేక జనం నరకయాతన అనుభవిస్తుంటే.. మరోవైపు అధ్యక్షుడు, మంత్రుల నివాసాలు 24 గంటల కరెంట్ సరఫరాతో వెలిగిపోతున్నాయి. జనం తిండిలేక చస్తుంటే పాలకులు దర్జా ప్రదర్శిస్తున్నారు. దాంతో ప్రజలు కోపంతో ఊగిపోతున్నారు. ఆంక్షలను సైతం లెక్క చేయకుండా వీధుల్లోకి వస్తున్నారుఅయితే.. ఈ సంక్షోభానికి కారణం అవినీతి కాదని.. కరోనా మూలంగానే పరిస్థితి తలకిందులైందని ప్రభుత్వం వాదిస్తోంది. ఇందులో కొంత వాస్తవం లేకపోలేదు. కరోనా మూలంగా విదేశీ పర్యటకుల రాక పూర్తిగా తగ్గింది. శ్రీలంక విదేశీ ఆదాయానికి ప్రధాన వనరు పర్యటక రంగమే. కరోనా మహమ్మారి వల్ల శ్రీలం టూరిజం పూర్తిగ్గా దెబ్బతింది. ఐతే కరోనా ఈ సవాళ్లను అధిగమించటంలో రాజపక్స ప్రభుత్వం అలసత్వం ప్రదర్శించమే ఈ దుస్థితికి కారణమని విశ్లేషకులు అంటున్నారు.వాస్తవానికి శ్రీలంక తాజా దుస్థితికి కారణం గడచిన రెండు మూడేళ్లు మాత్రమే కాదు. 20 ఏళ్లుగా అక్కడి ప్రభుత్వాల నిర్లక్ష్యంఆ దేశం దివాళా తీసేలా చేసింది. 2009లో అంతర్యుద్ధం ముగిసిన తరువాత గ్లోబల్ ఎకానమీతో కలవకుండా శ్రీలంక తప్పు చేసిందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. నాడు శ్రీలంక ఆర్థిక వృద్ధి రేటు 9 శాతం వరకు ఉంది. 2000ల సంవత్సరంలో జీడీపీలో 33 శాతంగా ఉన్న ఎగుమతులు ఇప్పుడు 12 శాతానికి పడిపోయాయి. శ్రీలంక రూపాయి విలువ తగ్గించడానికి ప్రభుత్వం నిరాకరించడం కూడా దేశంలో విదేశీ నిల్వలు తగ్గడానికి కారణమైందని అభిప్రాయపడుతున్నారు.2019 చివరి నాటికి 7.6 బిలియన్ డాలర్లుగా ఉన్న శ్రీలంక విదేశీ నిల్వలు ఇప్పుడు 2.3 బిలియన్ డాలర్లకు పడిపోయాయి. వీటిలో వినియోగానికి అవసరమయ్యేవి 300 మిలియన్ డాలర్లకు పడిపోయాయి. దాంతో పరిస్థితులు ఇప్పుడే కుదుటపడే అవకాశ లేదు. ఎక్కువగా దిగుమతులపై ఆధారపడే శ్రీలంకలో స్థిరమైన విదేశీ మారక ప్రవాహం లేకపోవటమే దీనికి కారణం. అందుకే పరిస్థితులు ఇంకా దిగజారతాయని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.అత్యవసర వనరులైన చమురు, విద్యుత్ వంటి వాటిని కొనడానికి కూడా శ్రీలంక వద్ద తగినన్ని డాలర్లు లేవు. విద్యుత్ బోర్డులు కోతలు విధించటానికి కారణం ఇదే. పోను పోను కోతల సమయం పెరగవచ్చు కూడా. ప్రస్తుతం 13 గంటల పాటు విద్యుత్ కోతలు విధిస్తున్నారు.. రాబోయే రోజుల్లో ఇది 16 గంటలకు పెరిగినా పెరగొచ్చు. విద్యుత్ కోతల కారణంగా లక్షలాది మంది ప్రజల దైనందిన వ్యవహారాలు, వ్యాపారాలు, చదువు ప్రభావితం అయ్యాయి. పెట్రోల్ బంకుల బయట, వంటగ్యాసు సిలిండర్ల కోసం గంటల పాటు ఎండలో ప్రజలు క్యూలల్లో బారులు తీరుతున్నారు. పెద్ద వయుస్కులు క్యూలోనే కుప్పకూలిపోతున్న ఘటనలు జరుగుతున్నాయి.మరోవైపు, ఈ సంక్షోభ సమయంలో సాయపడాలని శ్రీలంక విపక్ష నాయకుడు సజిత్ ప్రేమదాస ..ప్రధాన మంత్రి నరేంద్ర మోడీని అభ్యర్థించారు. తమ మాతృ భూమిని కాపాడుకునేందుకు మోడీ వీలైనంత సహాయం చేయాలని ఆయన మీడియా ముఖంగా కోరారు. ఆర్థిక సంక్షోభంతో సతమతమవుతోన్న శ్రీలంకకు భారత్ తగిన విధంగా సాయం చేస్తూనే ఉంది.

# రోజా జిల్లాల జగడం

తిరుపతి, ఏప్రిల్ 6,ఉగాది పర్వదినం పురస్కరించుకుని.. జగన్ ప్రభుత్వం కొత్త జిల్లాలు ఏర్పాటు చేసింది. అయితే కొత్త జిల్లాల ఏర్పాటు వల్ల ఫ్యాన్ పార్టీలోని ఎమ్మెల్యేలకు కొత్త నొప్పులు మొదలైనాయట. అయితే.. తమ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొత్త జిల్లాలపై తామే పెదవి విప్పితే.. తమ ప్రభుత్వం పరువు తాడేపల్లి ప్యాలెస్‌కూ కూత వేటు దూరంలో ఉన్న కృష్ణానదిలో పడి కొట్టుకు పోతుందని జగన్ పార్టీ ఎమ్మెల్యేలంతా నోటి మీద వేలేసుకుని మరీ అమ్మఒడి పథకం ద్వారా లబ్ధి పొందుతున్న విద్యార్థిలాగా సైలెంట్‌గా కూర్చున్నారట. అయితే ఇదే అంశంపై నగరి ఎమ్మెల్యే ఆర్కే రోజా తన నియోజకవర్గం నగరిని.. కొత్తగా ఏర్పాటైన తిరుపతి జిల్లా పరిధిలోకి తీసుకు వెళ్లాలని శతధా ప్రయత్నించిందని.. ఆ క్రమంలో ఈ పంచాయతీని ఆమె ... సీఎం జగన్ వద్దకి ఒకటి రెండు స్లారు కాదు.. ముచ్చటగా మూడు సార్లు స్వయంగా తీసుకు వెళ్లిందట. అయితే ముఖ్యమంత్రి జగన్ మాత్రం.. తనదైన శైలిలో.. ఈ విషయాన్ని లైట్ తీసుకున్నారని సమాచారం. చిత్తూరు జిల్లా రెండుగా అయింది. ఒకటి చిత్తూరు జిల్లాలనే కాగా.. మరొకటి తిరుపతి జిల్లాగా ఏర్పాటు అయింది. అయితే చిత్తూరు జిల్లాలో రోజా నియోజకవర్గం నగరితోపాటు జి. నెల్లూరు, చిత్తూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం, పుంగనూరు నియోజకవర్గాలు ఉన్నాయి. అయితే పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి.. రోజాకి రాజకీయ వైరం ఉందన్న సంగతి అందరికీ తెలిసిందే. ఇదే విషయం సీఎం జగన్‌కి కూడా తెలుసన్న సంగతి కూడా అందరికీ తెలిసిందే. అదీకాక.. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చాలా చాలా సీనియర్.. చంద్రబాబు సొంత ఇలాకా కుప్పంలో.. ఇటీవల జరిగిన స్థానిక ఎన్నికల్లో ఫ్యాన్ జెండా రెపరెపలాడిందంటే.. అదంతా.. పెద్దిరెడ్డి వారి చలవేనన్న విషయం కూడా తెలుగు ప్రజలందరికీ తెలిసిందే. జగన్ రాజకీయ ప్రత్యర్థి.. చంద్రబాబు రాజకీయా భవితవ్యానికి పెద్దిరెడ్డి వారితో చెక్ పెట్టించాలనే కృత నిశ్చయంతో సీఎం జగన్ ఉన్నారు. అందుకే ఆ విషయంలో పెద్దిరెడ్డి వారి మాట.. జగనన్నకి చద్దన్నం మూట అన్న సంగతి ఆ పార్టీలోని కీలక నేతలకే కాదు.. ఆర్కే రోజాకు కూడా బాగా తెలుసు. అందుకే.. తన జిల్లాలో పెద్దిరెడ్డి వారు ఉంటే.. తనకు రాజకీయంగా దెబ్బ అని విషయం రోజాకి బాగా అర్థమైందీ. ఈ నేపథ్యంలో తన నియోజకవర్గాన్ని తిరుపతికి తరలించుకుపోవాలని.. సీఎం జగన్‌ను కలిసి ఎన్ని సార్లు విన్నవించుకున్నా.... ఫలితం లేకపోవడంతో.. ఆర్కే రోజా ఆందోళన రోజుకు రోజుకు తీవ్రమవుతోందట. ఇదే అంశంపై మళ్లీ జగన్‌ను కలిసి.. విన్నవించుకునేందుకు.. ఈ ఆర్కే రోజా వారు.. రోజూ తాడేపల్లి ఫ్యాలెస్ చుట్టు ప్రదక్షణాలు చేస్తున్నారనే చర్చ కూడా సదరు ప్యాలెస్ సాక్షిగా వైరల్ అవుతోంది. కొత్త కేబినెట్‌లో మంత్రి వచ్చినా.. రాకపోయినా... ఫర్వలేదు కానీ.. తన నియోజకవర్గాన్ని మాత్రం శ్రీవారి జిల్లాలో కలపాలంటూ తన సన్నిహితుల వద్ద రోజా తన మనస్సులోని మాటకు బయటపెట్టినట్లు తెలుస్తోంది. అయితే ఇటీవల రోజా.. పలు దేవాలయాలను వరుసగా కీ ఇచ్చిన బొంగరంలా చుట్టేస్తోంది. జగన్ కేబినెట్‌లో చోటు కోసమే ఆమె ఈ దేవాలయాల ప్రదక్షణ అంటూ అటు మీడియాలోనే కాదు..ఇటు సోషల్ మీడియాలో సైతం తెగ వైరల్ అవుతోంది. కానీ రోజా దేవాలయాల ప్రదక్షణ వెనక ఇంత కథ ఉందా ? అని నగరిలోని ఆ పార్టీ నేతలే ముక్కన వేలేసుకుంటున్నారట. ఇప్పటికే నగరి నియోజకవర్గంలోని అయిదు మండలాల్లోని రోజా వ్యతిరేకవర్గాన్ని ఒకే తాటిపైకి తీసుకురావడంలో.. పెద్దిరెడ్డి వారు వేసిన పాచికా .. పారింది. దీంతో ఆర్కే రోజా ఎంత ఉక్కిరి బిక్కిరి అవుతున్నారో అందరికీ తెలిసిందే. మరి ఈ నేపథ్యంలో ఆర్కే రోజా.. మనస్సులోని కోరికను సీఎం జగన్ తీరుస్తారా? అంటూ పెద్దిరెడ్డి వర్గం వారు వ్యంగ్యంగా ప్రశ్నిస్తున్నారు. అంతేకాదు.. ఆర్కే రోజాను సీఎం జగన్ బాగా ఫిక్ చేశారంటూ ఆదే వర్గం వారు లోలోన సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మరి రోజా కోరికను సీఎం జగన్ తీరుస్తాడా? అంటే ఏమో చూడాలని ఆమె వర్గం వారు వెయ్యి కళ్లతో తిరుపతి జిల్లాలోని శ్రీవారిపైపు ఆశగా ఎదురు చూస్తున్నారు.

# అంబటికి... ఆమాత్య యోగం



గుంటూరు, ఏప్రిల్ 6, సత్తెనపల్లి ఎమ్మెల్యే అంబటి రాంబాబుకి జగన్ కేబినెట్‌లో సీటు గ్యారంటి అనే చర్చ అయితే కొత్తగా ఏర్పాటైన పల్నాడు జిల్లాలో తెగ వైరల్ అవుతోంది. జిల్లాలో ముగ్గురు ఎమ్మెల్యేలు.. విడుదల రజినీ, పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, అంబటి రాంబాబు పేర్లు తెరపైకి వచ్చినప్పటికీ.. అంబటి రాంబాబు వైపే సీఎం జగన్ మొగ్గు చూపినట్లు సమాచారం. అదీ కూడా కేబినెట్‌లో కీలక శాఖను అంబటికి కట్టబెట్టాలనే ఓ కృతనిశ్చయంతో సీఎం జగన్ ఉన్నట్లు తెలుస్తోంది. తాజాగా ఏర్పడిన ఈ జిల్లాలో చిలకలూరిపేట ఎమ్మెల్యే విడుదల రజినీ.. బీసీ సామాజిక వర్గానికి చెందిన నేత. 2019 ఎన్నికల్లో గెలిచి.. ఆమె తొలిసారి అసెంబ్లీలో అడుగు పెట్టారు. దీంతో క్యాస్ట్ ఈక్వేషన్స్ బట్టి ఆమెకు కేబినెట్‌లో ఛాన్స్ దక్కే అవకాశం కొద్దిగానే ఉందని సమాచారం. అలాగే మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి కూడా పార్టీలో సీనియర్ నేత. కానీ ఆయన క్యాస్ట్ ఈక్వేషన్స్ బట్టి.. ఆయనకు కేబినెట్‌లో ఛాన్స్ లేదని తెలుస్తోంది. ఇక జగన్ తన పాత కేబినెట్‌లోని సీనియర్ నేత బొత్స సత్యనారాయణ.. ప్లేస్‌ను ఈ అంబటి రాంబాబుతో ఫిల్ చేయాలని సీఎం జగన్ భావిస్తున్నట్లు సమాచారం. వచ్చేది ఎన్నికల వేళ.. గతంలో సత్తెనపల్లిలో కొడెల శివ ప్రసాద్ వర్గందే పై చేయి.. కానీ నేడు ఆ పరిస్థితి అక్కడ లేదు. ఈ నేపథ్యంలో మళ్లీ సత్తెనపల్లిలో ఫ్యాన్ పార్టీ సత్తా చాటాలంటే.. అంబటికి మంత్రి పదవి ఇచ్చి తీరాలని సీఎం మొండి పట్టుతో ఉన్నట్లు.. సజ్జల కార్యాలయంలో ఓ టాక్ అయితే నడుస్తోంది. ఇక అంబటి రాంబాబు గురించి అందరికీ తెలిసిందే. ఈ అంబటి రాంబాబు ప్రెస్ మీట్ పెట్టాడంటే.. అది ప్రతిపక్ష టీడీపీ అధినేత చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేశ్ బాబు లేదా జనసేనాని పవన్ కల్యాణ్‌పైన అయినా ఉంటుందనే ఓ టాక్ అయితే.. ఇటు ప్రజల్లోనే కాదు.. అటు మీడియా వారికి కూడా బాగా అర్థమైపోయింది. అంబటి రాంబాబు నోరున్న నేత అన్న సంగతి అందరికీ తెలిసిందే. అంతేకాదు.. ఆయా పార్టీల నేతలపై అంబటి రాంబాబును నిద్రలో లేపి అడిగినా.. ఒంటి కాలితో లేచి.. వారిపై మండిపతారన్న ఓ చర్చ అయితే ఫ్యాన్ పార్టీలోనే అండర్ కరెంట్‌గా రంజు రంజుగా నడుస్తోంది. 2014 ఎన్నికల్లో సత్తెనపల్లి నుంచి జగన్ పార్టీ అభ్యర్థిగా అంబటి పోటీ చేసి టీడీపీ సీనియర్ నేత కొడెల శివప్రసాద రావు చేతిలో స్వల్ప మెజార్టీతో ఓటమి పాలైయ్యారు. ఆ తర్వాత 2019 ఎన్నికల్లో మళ్లీ ఆయనపై పోటీ చేసి.. సత్తెనపల్లి ఎమ్మెల్యేగా అంబటి రాంబాబు తన సత్తాను చాటారు. జగన్ తొలి కేబినెట్‌లోనే రాంబాబును తీసుకుంటారని అంతా భావించారు. కానీ కొత్త వారికి... ఆయన కంటే జూనియర్లకు జగన్ అవకాశం ఇచ్చారు. వైయస్ఆర్ ఫ్యామిలీకి నమ్మిన బంటుగా ఎవరైనా ఉన్నారంటే.. అదీ అంబటి రాంబాబు అన్న సంగతి అందరికీ తెలిసిందే. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే... ఆ ఫ్యామిలీకి 100కి 100 శాతం లాయిల్టీగా ఉండే వ్యక్తి ఈ అంబటి రాంబాబు. 1989లో రేపల్లి నుంచి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేగా ఆయన గెలుపొందారు. 1994, 1999 ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. ఆ తర్వాత.. అంబటి రాజకీయాల్లోనే ఉంటూ.. రాజశేఖర్ రెడ్డికి బాగా దగ్గరయ్యారు. క్రమంలో 2004లో నాడు వైయస్ రాజశేఖర్ రెడ్డి.. నీకు ఎమ్మెల్యే సీటు ఇస్తానంటే.. వద్దు వద్దు.. మీరు ముఖ్యమంత్రి అయితే చాలంటూ తన వినయాన్ని.. తన వీర విధేయతను.. ఆ పెద్దయాన ముందు ప్రదర్శించి..మార్కులు కొట్టేశారీ అంబటి రాంబాబు. అంతే ఆ ఎన్నికల్లో వైయస్ ఇలా సీఎం కావడం.. ఆ వెంటనే ఆంధ్రప్రదేశ్ పరిశ్రమల మౌలిక సదుపాయాల సంస్థ చైర్మన్ పదవిని అలా అంబటికి కట్టబెట్టడం జరిగిపోయింది. అప్పటి నుంచి వైయస్ రాజశేఖర్ రెడ్డి అడుగులో అడుగు వేసి మరీ నడిచారు. ఆ తర్వాత వైయస్ఆర్ ఆకస్మిక మరణంతో.. వైయస్ జగన్ వెంట అంబటి నడిచారు. ఆ క్రమంలో వైయస్ జగన్.. కొత్త పార్టీ స్థాపించడంలో ఈయనదే కీలక పాత్ర. అంతేకాదు.. వైయస్ జగన్ 16 నెలలు జైలుకు వెళ్లినప్పుడు.. ప్రతి రోజు ఆ పార్టీ తరఫున ప్రెస్ మీట్ పెట్టి మరీ.. నాటి ప్రతిపక్ష పార్టీని తన వాక్ చాతుర్యంతో చీల్చి చండాడే వారన్న సంగతి అందరికీ తెలిసిందే. నాటి నుంచి నేటి వరకు వైయస్ ఫ్యామిలీకి.. ఎంత చేయాలో అంబటి రాంబాబు అంత చేశారనే ఓ చర్చ అయితే నాడు లోటస్ పాండ్ లోనే కాదు.. నేడు తాడేపల్లి ఫ్యాలెస్ వైరల్ అవుతోంది. అలాంటి నేతకు అమాత్య పదవి ఇచ్చి.. అందలం ఎక్కించాలని వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత భావిస్తున్నారట.

# ఏపీ కమలంలో కల్లోలం

విజయవాడ, ఏప్రిల్ 6, ఆంధ్రప్రదేశ్ బీజేపీ చీలిక వైపుగా అడుగులు వేస్తోందా? ఇంతవరకు తెరచాటున, ముఖ్యమంత్రి జగన్ రెడ్డి చంకెక్కి కూర్చున్న, వైసీపీ అనుకూల వర్గం, ఇప్పుడు బహిరంగంగానే వైసీపీకి బీ'టీమ్ అనిపించుకునేందుకు ఆరాట పడుతోందా? అందుకూ అవుననే సమాధానమే వస్తోంది. అలాగే, జనసేన అధినేత పవన్ కళ్యాణ్,తెలుగు దేశం పార్టీతో చేతులు కలిపితే, ఆయనతోనూ తెగతెంపులు చేసుకునేందుకు సిద్దమవుతోందా, అంటే అందుకూ అవుననే సమాధానమే వస్తోంది. నిజానికి, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు, మొదటినుంచి కూడా తెలుగు దేశం, వ్యతిరేక స్టాండ్ తీసుకోవడం తెలిసిన విషయమే.అదేమిటో కానీ, సోము వీర్రాజు ప్రభుత్వం మారి మూడు సంవత్సరాలు అయినా.. ఇంకా చంద్రబాబు నాయుడే ముఖ్యమంత్రి అనే భ్రమల్లో ఉన్నట్లు వ్యవహరిస్తున్నారు అని పించేలా చంద్రబాబు పైనే ఆరోపణలు చేస్తున్నారు. వైసీపీ వ్యతిరేక ఓటు చీలకుండా చూస్తానని ప్రకటించడం ద్వారా పవన్ కళ్యాణ్ ఇప్పటికే టీడీపీతో పొత్తు పక్కా, అనే సంకేతాలు ఇచ్చారు. అదే సమయంలో బీజేపీ రోడ్ మ్యాప్ గురించి మట్లాడడం ద్వారా 2014లో లాగా మళ్ళీ బీజేపీ, తెలుగు దేశం, జనసేన ఉమ్మడిగా పనిచేయాలనే సంకల్పాన్ని వ్యక్తపరిచారు. ఈ నేపథ్యంలోనే సోము వీర్రాజు వర్గం, 'ఒంటరి పోరాటం' అనే కొత్త రాగం ఎత్తుకుంది.నిజానికి బీజేపీ కేంద్ర నాయకత్వం, పొత్తుల గురించి ఇప్పుడే మాట్లాడవద్దని, ఎన్నికలు వచ్చినప్పుడు, అప్పటి పరిస్థితిని బట్టి కేంద్ర నాయకత్వం నిర్ణయం తీసుకుంటుందని, అంతవరకు జనసేనతో కలిసి వైసీపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఆందోళనచేయాలని ఆదేశించింది. అయితే, వీర్రాజు వర్గం, అందుకు విరుద్ధంగా, అధికారంలో ఉన్న వైసీపీని వదిలేసి టీడీపీ వ్యతిరేక ప్రచారం సాగిస్తున్నారు. నిజానికి, ఏపీలో బీజేపీకి ఉన్న బలం ఎంతో అందరికీ తెలిసిన విషయమే. బీజేపీ



రాష్ట్రంలో ఎవరితో అయినా పోటీ పడగలదు అంటే, అది ఒక్క నోటా'తో మాత్రమే. అయినా, సోము వీర్రాజు ఎక్కువగా ఉహించుకుంటున్నారో ఏమో కానీ, అవసరమైతే ఒంటరిగా పోటీ చేస్తాం' అని బింకాలు పోతున్నారు. ఒంటరిగా పోతే ఏమవుతుందో, తెలియని విషయం కాదు. బీజేపీ 2019 ఎన్నికలో ఒంటరిగానే పోటీ చేసింది. ఒక్క సీటు కాదు ఒక్క సీట్లో డిపాజిట్' కూడా రాలేదు.అయినా ఒంటరిగా పోటీ చేస్తామంటే అది వేరే విషయం, కానీ, అరాచక పాలనతో రాష్ట్రాన్ని వినాశనం దిశగా పరుగులు తీయిస్తున్న వైసీపీకి మేలు చేసే విధంగా ప్రవర్తించడం, ఏమిటని పార్టీలోనే చర్చ మొదలైంది. జనసేన పార్టీని కూడా దూరం చేసే వ్యూహాన్ని సోము వీర్రాజు అమలు చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం బీజేపీ ? జనసేన పొత్తులో ఉన్నా కేవలం సోము వీర్రాజు వ్యవహారశైలి వల్లనే ఆ రెండు పార్టీలు కలసి పని చేయలేకపోతున్నాయన్న అభిప్రాయం వినిపిస్తోంది. సోము వీర్రాజు అనుసరిస్తున్న వైసీపీ అనుకూల ధోరణిని, పార్టీలోని మెజారిటీ వర్గం వ్యతిరేకిస్తున్నట్లు తెలుస్తోంది.

# శ్రీ భరత్ కు మొండిచేయి...

విశాఖపట్టణం, ఏప్రిల్ 6, శ్రీభరత్.. లోకేష్ కో బ్రదర్.. బాలకృష్ణ అల్లుడు. ఆయన రాజకీయ భవిష్యత్ అగమ్య గోచరంలో పడేలా ఉంది. శ్రీభరత్ గీతం వ్యవస్థాపకులు ఎంవీవీఎస్ మూర్తి, మాజీ కేంద్ర మంత్రి కావూరి సాంబశివరావు మనవడు కూడా. మూర్తి మరణం తర్వాత శ్రీభరత్ గీతం విద్యాసంస్థల బాధ్యతను చేపట్టారు. రాజకీయ వారసత్వాన్ని కూడా అందుకున్నారు. తెలుగుదేశం పార్టీ తరుపున గత ఎన్నికల్లో విశాఖ పార్లమెంటుకు శ్రీభరత్ పోటీ చేసి ఓటమి పాలయ్యారు. గత ఎన్నికలలో శ్రీభరత్ ఓటమిపాలు కావడానికి తెలుగుదేశం పార్టీలోని కొందరు కారణమని ఆయన భావించారు. కొన్ని రోజులు పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్నా తర్వాత క్రమంగా చేరువయ్యారు. ప్రస్తుతం యాక్టివ్ గానే ఉన్నారు. కానీ వచ్చే ఎన్నికల్లో విశాఖ పార్లమెంటు టిక్కెట్ శ్రీభరత్ కు దక్కుతుందా? లేదా? అన్నది సందేహంగానే ఉంది. ఎందుకంటే ఈసారి తెలుగుదేశం పార్టీ పొత్తులతోనే ఎన్నికలకు వెళ్లనుంది. ఏ పార్టీతో పొత్తు ఉన్నా... జనసేనతో పొత్తు పెట్టుకున్నా, బీజేపీతో పొత్తు పెట్టుకున్నా విశాఖ స్థానాన్ని వారికి వదిలేయాల్సి ఉంటుంది. గత ఎన్నికల్లో జనసేన పార్టీ నుంచి జేడీ లక్ష్మీనారాయణ పోటీ చేసి స్వల్ప తేడాతో ఓటమి పాలయ్యారు. ఆయన జనసేన నుంచి బయటకు వచ్చారు. బీజేపీ నుంచి కేంద్ర మాజీ మంత్రి పురంద్రీశ్వరి పోటీ చేశారు. జనసేనతో పొత్తు ఉన్నా ఆ స్థానాన్ని పొత్తులో భాగంగా మిత్రపక్షాలకు వదిలేయాల్సి ఉంది. ఖచ్చితంగా అదే జరుగుతుందన్న అంచనా వినిపిస్తుంది. ఎమ్మెల్యే అభ్యర్థిగానైనా...? ఈ నేపథ్యంలో శ్రీభరత్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్నది ఆసక్తికరంగా మారింది. ఇప్పటికే నందమూరి కుటుంబానికి అన్యాయం జరిగిందన్న విమర్శలున్నాయి. కానీ చంద్రబాబు మాత్రం వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కొన్ని కీలకమైన సీట్లు కూడా వదులుకోవడానికి సిద్ధపడుతున్నారు. అందుకే శ్రీభరత్ పోటీపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. త్యాగాలకు సిద్ధంగా ఉండాలని చంద్రబాబు పిలుపునివ్వడం కూడా అనుమానాలకు మరింత బలపరుస్తుంది. మరి శ్రీభరత్ భీమిలి వంటి అసెంబ్లీ నియోజకవర్గాలను ఎంపిక చేసుకుంటారా? లేదా? అన్నది చూడాల్సి ఉంది.

# బీసీలకు మద్దతుగా వైసీపీ అడుగులు



రాజమండ్రి, ఏప్రిల్ 6, 2024 ఎన్నికలు జగన్ కు సవాల్ అని చెప్పక తప్పదు. ఐదేళ్ల పరిపాలన చూసిన తర్వాత జగన్ కు నిజంగా ఓటు వేసే ఎన్నిక ఇది. ఎటువంటి సానుభూతి ఈసారి ఎన్నికల్లో పనిచేయదు. అలాగే ఇంకో ఛాన్స్ అనడానికి లేదు. కేవలం పరిపాలనను బేరీజు వేసుకుని మాత్రమే ఈసారి ఓటింగ్ జరగనుంది. అయితే ఆంధ్రప్రదేశ్ లో కులాల జాఢ్యం ఉ ంది. పార్టీలతో సంబంధం లేకుండా కులాల వారీగా విడిపోయి మరి పార్టీలకు అండగా నిలబడే సంప్రదాయం ఉంది. కులాల వారీగా... పాలనతో సంబంధం లేదు. అభివృద్ధి అవసరం లేదు. అవతలి కులం ఎవరికి మద్దతిస్తే, తాము మరొకరికి సపోర్టు చేయడమే ఏపీ ఎన్నికలలో జరుగుతుంది. గత ఎన్నికల్లోనూ జగన్ కు అన్ని కులాలు అండగా నిలిచాయి. తన సొంత సామాజికవర్గంతో పాటు దళిత, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు జగన్ కు అండగా నిలిచారు. అలాగే కాపు సామాజికవర్గంలోనూ మెజారిటీ ఓటర్లు జగన్ కు మద్దతు తెలిపారు. బీసీలయితే జగన్ కు తొలిసారి టీడీపీని కాదని మద్దతిచ్చారు. ఫలితంగానే జగన్ పార్టీకి గత ఎన్నికల్లో 151 స్థానాలు వచ్చాయి. విపక్షాలు పూర్తిగా దెబ్బయి పోవడానికి కులాల లెక్కలే కారణమని చెప్పకతప్పదు. గత ఎన్నికల్లో..... గత ఎన్నికల్లో ప్రధాన పార్టీ తెలుగుదేశానికి నలభై శాతం, జనసేనకు 7 శాతం, వైసీపీకి 50 శాతం ఓట్లు వచ్చాయి. గత ఎన్నికల్లో విడివిడిగా పోటీ చేయడంతో నష్టపోయామని, ఈసారి ఎన్నికల్లో పొత్తులతో జగన్ ను కట్టడి చేస్తామని విపక్షాలు చెబుతున్నాయి. చంద్రబాబుకు ఓసీల్లో ఆయన సొంత సామాజికవర్గంతో పాటు బ్రాహ్మణ, వైశ్య సామాజికవర్గం మద్దతిచ్చే అవకాశముంది. పవన్ తో కలిస్తే ఈసారి కాపులు ఈ కూటమికే మద్దతు తెలుపుతారు. అందువల్లనే జగన్ లెక్కలు వేసుకుని ఏపీలో అత్యధికంగా ఉన్న బీసీలను మరింతగా తనవైపునకు తిప్పుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ముందుగానే ఊహించిన జగన్ అధికారంలోకి రాగానే బీసీలపై ఫోకస్ పెంచారు. 139 బీసీ కులాలు ఉంటే 56 కార్పొరేషన్లను ఏర్పాటు చేసింది. పదవుల పంపిణీలు, నామినేటెడ్ పనుల్లోనూ బీసీలకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు. అయితే వీటిని వివరించి వారిని మరింత దగ్గరకు చేర్చుకునేందుకు బీసీ ప్రాంతీయ సదస్సులు ఏర్పాటు చేయాలని వైసీపీ నిర్ణయించింది. తర్వాత రాష్ట్ర స్థాయిలో బీసీ సదస్సు నిర్వహిస్తారు. జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాతే బీసీలకు గుర్తింపు లభించిందన్న నినాదంతో ఈ సదస్సులు ఏర్పాటు కానున్నాయి. కాపులు దూరమయినా బీసీలను దగ్గరకు చేర్చుకునే ప్రయత్నం జగన్ పార్టీ మొదలు పెట్టింది. మరి ఫలితం ఎలా ఉంటుందనేది వేచి చూడాలి.

# టీడీపీది తప్పుడు ప్రచారం

విశాఖపట్నం విశాఖ భూములపై టీడీపీ తప్పుడు ప్రచారం చేస్తోందని ఏపీ మంత్రి బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు. ఈ భూములకు సంబంధించి టీడీపీ హయాంలోనే జీవో నెంబర్ 121 జారీ చేశారని తెలిపారు. తమ భూములు అంతా పారదర్శకంగా ముందుకెళ్తోందన్నారు. చంద్రబాబు హయాంలోనే ఎన్సీసీ సంస్థకు జీపీఏ ఇచ్చారని? కేబినెట్ నిర్ణయం తీసుకున్న తర్వాత మార్చడానికి వీల్లేదన్నారు. కేబినెట్ సమావేశంలోనే మార్పులు చేర్పులు చేయాలని తెలిపారు. అందుకే తమ ప్రభుత్వం జీపీఏను ఉపసంహరించిందని తెలిపారు. విశాఖ ఎన్సీసీ భూముల వివాదంపై దర్యాప్తు చేస్తామని చెప్పారు.టూ మెన్ కమిటీ భూమి విలువ రూ.197 కోట్లుగా నిర్ణయించిందని తెలిపారు. డబ్బులు కట్టాలని ఎన్సీసీ సంస్థకు చెప్పామని వెల్లడించారు. ప్రభుత్వానికి రూపాయి నష్టం రానివ్వబోమని స్పష్టం చేశారు. విశాఖ ఎన్సీసీ భూముల వివాదంపై దర్యాప్తు చేస్తామని చెప్పారు. గత 3రోజులుగా విశాఖలో ఒక భూమిని ప్రభుత్వం దారా దత్తం చేసిందని.. ప్రభుత్వానికి నష్టం వచ్చిందని ఆరోపిస్తున్నారని పేర్కొన్నారు. ఎన్సిసి సంస్థకు ఇచ్చిన భూమి 2005లో పిపిపి మూడ్ లో ఆ భూమిని అభివృద్ధికి ఇచ్చారని తెలిపారు. ఆ సంస్థ రూ.90 కోట్లు ప్రభుత్వానికి చెల్లించిందని తెలిపారు. అది 97ఎకరాల 10 సెంట్లు భూమి అని తెలిపారు.

# లక్ష్యానికి దూరంగా సేకరణ

విజయవాడ, ఏప్రిల్ 6,రాష్ట్ర ప్రభుత్వం ఖరీఫ్ సీజన్‌లో రైతాంగం నుంచి కేవలం 38,71,976 టన్నుల ధాన్యాన్ని మాత్రమే సేకరించింది. సేకరించిన ధాన్యం విలువ రూ.7,532.74 కోట్లు. రైతాంగం నుంచి 50 లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని ప్రభుత్వం చేసిన ప్రకటన కేవలం పేపర్లకే పరిమితమైంది. దీనివల్ల రైతాంగం తీవ్ర నష్టాలను చవిచూడాల్సి వచ్చింది. దళారుల చేతిలో దారుణంగా మోసానికి గురవ్వాల్సిన పరిస్థితి నెలకొంది. జనవరి రెండో వారం నుంచి ఖరీఫ్ ధాన్యం సేకరణ మందగించింది. అప్పటికే రూ.3 వేల కోట్లు వరకు రైతులకు ప్రభుత్వం బకాయిలు పెట్టింది. 21 రోజుల గడువు దాటినా చెల్లించలేని పరిస్థితుల్లో అధికారులు సర్వర్లను నిలిపివేశారని రైతులు ఆరోపించారు. అయినా అధికారులు తమకేం పట్టనట్లు మిన్నకుండిపోయారు. విమర్శలు వెల్లువెత్తడంతో మార్చి నెలలో కొంచెంకొంచెం సేకరించిన ప్రభుత్వం లక్ష్యాన్ని ఛేదించలేక చేతులెత్తేసింది. మిల్లర్లు, దళారులు రైతులను దోచుకునేందుకు ప్రభుత్వమే మార్గం తెరిచినట్లయ్యింది. క్వింటా ధాన్యానికి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.1,960 (ఎ గ్రేడ్), రూ.1,940 (సాధారణ రకం). మిల్లర్లు, దళారులు రైతుల నుంచి రూ.1,500లకు మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. కృష్ణా జిల్లాలో ఇంకా కొన్ని ప్రాంతాల్లో వరికుప్పలు నూర్చలేదు. కొన్నిచోట్ల ధాన్యం కళ్లాల్లో ఉన్నప్పటికీ, కొనేవారు లేక దళారులకు అమ్మి మోసపోలేక ప్రభుత్వం కొనకపోతుందా? అని రైతులు ఎదురుచూస్తున్నారు. మొత్తానికి ఖరీఫ్ ధాన్యం సేకరణ పూర్తయ్యిందని, రబీ ధాన్యం సేకరణ ప్రారంభంతో రుజు వైంది. ప్రతి గింజా కొనుగోలు చేస్తామని మంత్రులు, అధికారులు చేసిన వ్యాఖ్యలు ప్రకటనలకే పరిమితం కావడంతో రైతులు దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నారు. 2021-22 ఖరీఫ్ ధాన్యం 36.74 లక్షల ఎకరాల్లో సాగైంది. దీని నుంచి 83 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి వచ్చింది. దీనిలో ప్రభుత్వం 5,312 రైతుభరోసా కేంద్రాల నుంచి 38.71 లక్షల టన్నుల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేసింది. దీనివల్ల 6,02,170 మంది రైతులు మాత్రమే మద్దతు ధర పొందారు. వీరిలో 5,21,384 మంది రైతులకు మాత్రమే రూ.6,885.42 కోట్లు ప్రభుత్వం ధాన్యం డబ్బులు చెల్లించింది. మరో 80,786 మందికి రూ.647.32 కోట్లు చెల్లింపులు పెండింగులో ఉన్నాయి. ఇది రూ.800 కోట్లు వరకు ఉంటుందని సమాచారం. తమ వద్ద ఉన్న ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేయాలని వరి కుప్పలు ఇంకా నూర్చని రైతులు వేడుకుంటున్నారు.

# విశాఖలో బీజేపి వేడుకలు

న్యూఢిల్లీబిజెపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు విశాఖ బిజెపి కార్యాలయంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు సోమువీర్రాజు మాట్లాడుతూ దేశ రాజకీయాలు లో అవినీతి తొలగించడానికి బిజెపి ఆవిర్భవించింది. జాతీయ భావాలతో పనిచేస్తాం. బిజెపి పార్టీ ఈదేశానికి చారిత్రక అవసరం. కాంగ్రెస్ కు వ్యతిరేకంగా తెలుగు దేశం ఏర్పడింది. కాంగ్రెస్ నుండి వచ్చిన విత్తనాలు పేర్లు తో ప్రభావం చూపాలని చూస్తున్నారని అన్నారు.వీరందరికీ ప్రత్యామ్నాయ రాజకీయ పార్టీ బిజెపి మాత్రమే. రాష్ట్ర వ్యాప్తంగా ఈరోజు నుండి 20వ తేదీ వరకు ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అనేక సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. రాష్ట్ర వ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలు అమలు జరుగుతోంది. స్టీల్ ప్లాంట్ విషయంలో ఎపిబిజెపి ఖచ్చితం నిర్ణయం తీసుకుందని అయన అన్నారు.

# ఉర్దూ స్కూలు లో దారుణం

**మైనర్ బాలికపై లైంగిక దాడికి యత్నం**

విజయవాడ విజయవాడ అరండల్ పేట లోని మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ ఉర్దూ స్కూల్ ప్రాంగణం లో నాలుగో తరగతి చదువుతున్న అమ్మాయి పై ఆకతాయిల అఘాయిత్యానికి పాల్పడ్డారు. స్కూల్ ఆవరణలో ఎటు చూసినా మద్యం బాటిళ్లు గంజాయి సేవించే ఆనవాలు కనిపించాయి. పాఠశాలలకు పిల్లల్ని పంపించాలంటే నే పోతున్న పిల్లల తల్లిదండ్రులు హడలెత్తిపోతున్నారు. ఘటనను వెలుగులోకి రాకుండా అధికార పార్టీ నాయకులు ప్రయత్నినిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. గత ఆదివారం రోజు రాత్రి సమయంలో లో మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ ఉర్దూ స్కూల్ ఎదురు సందులో గల ఇద్దరు ఆకతాయిలు 4వ తరగతి చదువుతున్న అమ్మాయిని అటుగా రోడ్డుపై వెళ్తున్న ఆమెను బలవంతంగా పట్టుకొని స్కూల్ గోడ పై నుండి లోపలికి పడవేసారు. తరువాత సుమారు గంట వరకు ఆ అమ్మాయి పై అఘాయిత్యం చేసేందుకు ప్రయత్నించారు. ఠి అమ్మాయి వాటిని నిలువరించి కేకలు వేయడంతో ఆ అమ్మాయిని అక్కడే వదిలేసి పారిపోయిన సంఘటన వెలుగులోకి వచ్చింది. అమ్మాయి బట్టలు చిరిగి ఉండటంతో చూసిన తండ్రి ఏమైంది అని అడుగగా అప్పుడు అమ్మాయి జరిగిన విషయాన్ని తెలియజేసింది. వారు విజయవాడ నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ ఆశ్రయించిన పిదప పోలిసు వారి కేసు నమోదు చేసారు. ఇంత పెద్ద ఘటన జరిగినా కూడా స్కూల్ ఆవరణలో ఎటువంటి సెక్యూరిటీ సిబ్బందిని ఏర్పాటు చేయకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందని చుట్టుపక్కల ప్రజలు వాపోతున్నారు

# వైభవంగా శ్రీ కోదండరామస్వామివారి రథోత్సవం

తిరుపతి, ఏప్రిల్ 06తిరుపతిలోని శ్రీ కోదండరామస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు బుధవారం ఉదయం రథోత్సవం వైభవంగా జరిగింది. ఉదయం 7.10 గంటలకు రథోత్సవం ప్రారంభమైంది. శ్రీ సీత లక్ష్మణ సమేత శ్రీ కోదండరామస్వామివారు రథాన్ని అధిరోహించి ఆలయ మాడ వీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా కళాబృందాల కోలాటాలు ఆకట్టుకున్నాయి. ఆత్మ రథికుడు, శరీరమే రథం, బుద్ధి సారథి, మనస్సు పగ్గం, ఇంద్రియాలే గుర్రాలు, విషయాలే వీధులు. ఈ రీతిలో శరీరాన్ని రథంతో పోల్చడంతో స్థూల శరీరం వేరని, ఆత్మ అందుకు భిన్నమనే ఆత్మానాత్మ వివేకం కలుగుతుంది. రథోత్సవంలో ముఖ్యంగా కలిగే తత్త్వజ్ఞానమిదే. సాయంత్రం 6 నుండి 7 గంటల వరకు ఊంజల్‌సేవ వైభవంగా జరగనుంది. రాత్రి 8 గంటల నుండి 10 గంటల వరకు అశ్వ వాహనంపై శ్రీ కోదండరామస్వామివారు భక్తులకు కనువిందు చేయనున్నారు. వాహనసేవలో శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్‌స్వామి, శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్‌స్వామి, ఆలయ ప్రత్యేక శ్రేణి డెప్యూటీ ఈవో పార్వతి, ఏఈవో దుర్గరాజు, కంకణబట్టార్ ఆనందకుమార్ దీక్షితులు, సూపరింటెండెంట్ రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు మునిరత్నం, జయకుమార్, ఆలయ అర్చకులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# సైకిల్ తొక్కేది పవన్.. ఎక్కేది బాబు..!

**వైకాపా ఎమ్మెల్యే అంబటి రాంబాబు**



తాడేపల్లి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే, రాష్ట్ర అధికార ప్రతినిధి అంబటి రాంబాబు మీడియాతో మాట్లాడారు. పవన్ కల్యాణ్ వ్యూహాలన్నీ సైకిల్ దారే..! ఎంతమంది కట్టకట్టుకుని వచ్చినా.. 2024లో ఫ్యాన్ జెండానే రెపరెపలాడుతుంది. చంద్రబాబు పల్లకి మోయటానికి జనసైనికులు కష్టపడాలా పవన్ కల్యాణ్ అని అన్నారు. రైతులకు సినిమాల్లో వచ్చిన డబ్బులు ఇస్తున్నాడో లేక ఎన్టీఆర్ ట్రస్టు డబ్బులు ఇస్తున్నాడో తేలాలి. టీడీపీ హయాంలో రైతులను పచ్చి దగా చేసింది చంద్రబాబు, పవన్ లు కాదా..? మీ పాపాల పరిహారం కోసం రైతు భరోసా యాత్ర చేస్తారా..? - మీది రైతు భరోసా యాత్రా లేక చంద్రబాబు భరోసా యాత్రా..? కౌలు రైతులను గుర్తించింది, రైతులకు మేలు చేస్తున్న రైతు పక్షపాతి ప్రభుత్వం ఇది. రైతుల గురించి మాట్లాడే నైతిక హక్కు చంద్రబాబు, పవన్ కు లేదు. జనసేనలో చంద్రబాబు పెట్టిన కాపలాదారుడు నాదెండ్ల మనోహర్. అర్హులైన ప్రతి ఒక్కరికీ వారి గడప వద్దకే సంక్షేమం.. ఏ పార్టీతోనైనా చర్చకు సిద్ధమని అన్నారు. రైతులను పచ్చిదగా, మోసం చేసింది బాబు, పవన్ లు కాదా..? రైతులకు అన్యాయం జరుగుతుందని మాట్లాడుతున్న పవన్ కల్యాణ్ ఒక్క విషయం గుర్తు చేసుకోవాలి. 2014లో టీడీపీతో కలిసి పనిచేసింది పవన్ కల్యాణే. ఆ అయిదేళ్ల పాటు తెలుగుదేశం పార్టీ ఈ రాష్ట్రాన్ని పరిపాలించింది. రైతుల పట్ల ఆ ప్రభుత్వం వ్యవహరించిన తీరు ఎలా ఉంది? రైతుల కష్టాలకు, ఆత్మహత్యలకు బాధ్యులు ఎవరు అనేది పవన్ కల్యాణ్, జనసేన పార్టీ మర్చిపోయినట్లు ఉంది. 2014కు ముందు ఉమ్మడిగా మీరు ఎన్నికలకు వెళ్లినప్పుడు... తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే.. రైతులకు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి ప్రతిజ్ఞ చేశారు. రూ.87వేల 612 కోట్ల రైతులకు రుణమాఫిని చేస్తామని చెప్పారు. అధికారంలోకి వచ్చారు, మరి ఏం చేశారు? రద్దు చేశారా? రైతుల రుణాలల్లో కోతలు వేసేందుకు కోటయ్య కమిటీని వేసి తమ్మిని బమ్మిని చేసి స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ అని... ఇన్స్టాల్మెంట్ల బేసిస్ మీద రుణమాఫీ చేస్తామని, 87,612 కోట్ల రూపాయిల రుణాలకు గానూ 25వేల కోట్లు మాత్రమే ఇవ్వగలమని చావు కబురు చల్లగా కోటయ్యగారి కమిటీతో చెప్పారు. అక్కడే రైతుల నడ్డి విరిగిపోయింది. 24వేల కోట్లు ఇచ్చారా? అదీ ఇవ్వలేదు, ఆఖరికి రూ. 15వేల కోట్లు ఇచ్చి సర్దుకున్నారు. ఆ అయిదేళ్లలో రైతుల పరిస్థితి దిగజారడానికి కారణం మీరు కాదా.. ?. మీ మాటలు నమ్మి బ్యాంకుల్లో కుదవ పెట్టిన బంగారం ఇంటికి వస్తుందని రైతులు ఆశపడ్డారే. తాము చేసిన రుణమంతా అణాపైసలతో సహా మాఫీ అయిపోతుందని రైతులు కలలు కన్నారు, మీకు ఓటు వేశారు. మరి అధికారంలోకి వచ్చాక రైతులను పచ్చి దగా, మోసం చేసింది టీడీపీ, పవన్ కల్యాణ్లు కాదా?. అప్పుడు అధికారంలో ఉంది- మీరు మద్దతు ఇచ్చిన చంద్రబాబు నాయుడు కాదా? ఆరోజు రైతులు గుర్తురాలేదే? ఆరోజు రైతు భరోసా యాత్ర చేయాలని పవన్కు అనిపించలేదాఅని ప్రశ్నించారు. ఏ రైతు కుటుంబం అయినా, ఒక్కసారిగా అప్పులు పాలైపోరు. కాలానుగుణంగా అప్పులపాలు అవుతారు. ఇవాళ ఎక్కడైనా ఆత్మహత్యలు జరుగుతున్నాయంటే.. దీనికి ప్రధాన కారణం తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు రైతులను నట్టేట ముంచడం వల్లనే. వారి అప్పులు తీర్చకపోవడం వల్లే వాళ్లు నష్టపోయారు. రైతుల ఆశని అడియాశలు చేసారు. అందువల్లే అక్కడక్కడ రైతుల ఆత్మహత్యలు జరుగుతున్నాయని అన్నారు.

# ఎస్సీ, ఎస్టీలపై సీఎం వరాల జల్లు



బెంగళూరు: మాజీ ఉపప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ 115వ జయంతిని పురస్కరించుకుని రాష్ట్ర ప్రజలు మంగళవారం ఘనంగా నివాళులర్పించారు. విధానసౌధ వద్ద జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై పుష్పాంజలి ఘటించారు. ఇదే సందర్భంగా జగ్జీవన్‌రామ్ పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సీఎం పలు వరాలు ప్రకటించారు. ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా నిర్ణీత ప్రమాణంలో విద్యుత్ వాడుకునే అవకాశం కల్పిస్తున్నట్టు తెలిపారు. భూమిపై హక్కులు పొందేందుకు ప్రస్తుతం ఈ వర్గాలకు ఇస్తున్న సబ్సిడీని రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షలకు పెంచాలని తీర్మానించామన్నారు. ఎస్సీ ఎస్టీల ఇళ్ల నిర్మాణానికి మంజూరు చేస్తున్న రూ.1.75 లక్షల సబ్సిడీని రూ.2 లక్షలకు పెంచుతున్నామన్నారు. అన్ని తాలూకాల్లోనూ జగ్జీవన్‌రామ్ స్వయం ఉపాధి పథకాలను అమ లు చేసే దిశలో ప్రణాళిక సిద్ధమవుతోందని, మరో నెలలో దీన్ని అమలు చేస్తామన్నారు. గ్రామీణ ప్రాంతాలలో కుటీర పరిశ్రమలు నిర్వహించే ఎస్సీ, ఎస్టీ వర్గాలకు 75 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్‌ను అందచేస్తామన్నారు. ఎస్సీ, ఎస్టీ హాస్టళ్లలో ప్రత్యేక శిక్షణ తరగతులను ప్ర స్తుత ఏడాది నుంచే ప్రారంభిస్తామన్నారు. ము ఖ్యమంత్రి మార్గదర్శిని వేదిక ద్వారా 8-12 తరగతి విద్యార్థులకు ఈ శిక్షణ లభిస్తుందన్నారు. ఈ వర్గాలకు చెందిన యువత స్టార్ట్‌పలు ప్రారంభించేందుకు ముందుకు వస్తే రూ.50 లక్షల వరకు సబ్సిడీని ఇప్పటికే బడ్జెట్‌లో ప్రకటించామన్నారు. ఎస్సీ, ఎస్టీలు సామాజిక, ఆర్థిక స్వావలంబన సాధించే దిశలో ప్ర భుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. ఇదే సందర్భంగా వివిధ రంగాలలో గణనీయ సేవలందిస్తున్న ప్రముఖులకు ఆయన డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ పురస్కారాలను ప్రదానం చేసి సన్మానించారు. కాంగ్రెస్, బీజేపీ, జేడీఎస్ ఆధ్వర్యంలోనూ జగ్జీవన్‌రామ్ జయంతి కార్యక్రమాలు జరిగాయి. రాష్ట్ర వ్యాప్తంగా అ న్ని జిల్లా, తాలూకా కేంద్రాలలో ఆయనకు ఘనంగా ని వాళులర్పించారు.

# 97 శాతం టీకాలు ఉచితం

న్యూఢిల్లీ ఏప్రిల్ 6, పాండమిక్ సమయంలో ఆక్సిజన్ కొరత కారణంగా ప్రాణ నష్టం జరిగినట్లు నిర్ధారిస్తూ ఏ రాష్ట్రం లేదా కేంద్రపాలిత ప్రాంతం సమాచారం ఇవ్వలేదని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి భారతి పవార్ రాజ్యసభకు తెలిపారు. ఆక్సిజన్ కొరత కారణంగా మరణించిన వారి వివరాలను సమర్పించాలని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను కేంద్రం కోరినట్లు ఆమె సభకు తెలియజేశారు. ఈ విషయంపై మొత్తం 20 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి స్పందన వచ్చినట్లు తెలిపారు. అయితే వాటిలో ఏదీ ఆక్సిజన్ కొరత కారణంగా తమ రాష్ట్రాల్లో మరణాలు నమోదైనట్లు ధృవీకరించలేదని మంత్రి భారతి పవార్ వెల్లడించారు.ఆక్సిజన్ కొరత కారణంగా సంభవించిన మరణాలపై రాజ్యసభలో కాంగ్రెస్ సభ్యుడు శక్తిసిన్హ్ గోహిల్ అడిగిన ప్రశ్నకు సమాధానంగా కేంద్ర మంత్రి ఈ వివరాలు వెల్లడించారు. దీనికి సంబంధించి రాష్ట్రాలకు కేంద్రం పలు రిమైండర్లు పంపినా ప్రయోజనం లేకపోయిందన్నారు. ఈ విషయంలో రాష్ట్రాల నుంచి ఏమైనా అదనపు సమాచారం అందితే.. ఆ వివరాలను కేంద్రం పార్లమెంటుకు సమర్పిస్తుందని చెప్పారు. కరోనా మహమ్మారి కారణంగా దేశంలో సంభవించిన మొత్తం మరణాల గురించి కేంద్ర మంత్రి భారతి పవార్ రాజ్యసభకు తెలియజేశారు. 2022 ఏప్రిల్ 4 నాటికి దేశంలో ఆూఎఆ-19 కారణంగా మొత్తం 5,21,358 మరణాలు సంభవించినట్లు తెలిపారు. ఆ మేరకు మరణాల సంఖ్యను రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు కేంద్రానికి నివేదించాయని చెప్పారు.కోవిడ్-19 మరణాలకు రూ.50వేల పరిహారం కోవిడ్ -19 మరణాలకు రూ. 4 లక్షల పరిహారం చెల్లించాలనే తన నిర్ణయాన్ని ప్రభుత్వం ఎందుకు వెనక్కి తీసుకుందనే దానిపై కాంగ్రెస్ ఎంపీ గోహిల్ మళ్లీ అడిగిన ప్రశ్నకు సమాధానంగా.. పేద రోగులకు బీమా కార్యక్రమాల ద్వారా సదుపాయం కల్పించామని భారతి పవార్ తెలిపారు. కేంద్ర, రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో ఎక్స్‌గ్రేషియా చెల్లింపులను పరిగణనలోకి తీసుకుని.. ఎక్స్‌గ్రేషియాను రూ. 4 లక్షలకు బదులుగా రూ.50 వేలు ఇవ్వాలని నిర్ణయించినట్లు చెప్పారు.కోవిడ్-19 సమయంలో ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుందని కేంద్ర మంత్రి వివరించారు. దేశంలో ఆరోగ్య సదుపాయాల కల్పనకు రూ.64,000 కోట్ల రూపాయల బడ్జెట్‌ను కేటాయించిందని మంత్రి తెలిపారు. ఇప్పటి వరకు 300 ప్లస్ ల్యాబొరేటరీలు, ఐదు లక్షలకు పైగా ఆక్సిజన్-సపోర్ట్ బెడ్లు, 1.5 లక్షల ఐసియు పడకలు, 4,000 పైగా ఖూం ప్లాంట్లు, 60 వేల వెంటిలేటర్లు సమకూర్చుకోగా.. అన్ని అత్యవసర సౌకర్యాలు అప్‌గ్రేడ్ చేయబడినట్లు వివరించారు. కొత్త వేరియంట్లు, వైరస్‌లను గుర్తించడం కోసం ఇటీవల బయో-సేఫ్టీ లెవల్ 3 (బిఎస్ఎల్) మొబైల్ లాబొరేటరీని కూడా తీసుకొచ్చినట్లు తెలిపారు.టీకా కార్యక్రమం.. అంతేకాకుండా, దేశంలోని మొత్తం జనాభాకు రెండు డోసుల టీకాలు ఎప్పుడు వేస్తారనే దానిపై తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) ఎంపి శాంతాను సేన్ అడిగిన ప్రశ్నకు సమాధానంగా.. దేశ జనాభాలో 97% మందికి మొదటి డోస్ అందించామని భారతి పవార్ తెలిపారు. రెండో డోస్ 85% వరకు అందించినట్లు తెలిపారు. టీకాలు వేయడం ఐచ్ఛికమని, అందరూ కలిసికట్టుగా పనిచేసి వ్యాక్సినేషన్ ప్రచారంలో పాలుపంచుకోవాలని ప్రభుత్వం భావిస్తోందని ఆమె పేర్కొన్నారు. అయితే వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఎప్పటి లోగా పూర్తి చేస్తారో కేంద్ర మంత్రి వెల్లడించలేదు.అటు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి మన్సుఖ్ మాండవియా కూడా దేశంలో కొనసాగుతున్న టీకా డ్రైవ్ వివరాలను మంగళవారంనాడు పార్లమెంటుకు తెలియజేశారు."మార్చి 30, 2022 నాటికి, జాతీయ కోవిడ్-19 టీకా కార్యక్రమం కింద 18 ఏళ్లు, అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న అర్హులైన లబ్ధిదారులకు మొత్తం 167.14 కోట్ల డోసులు (మొత్తం డోస్‌లో 97 శాతం) ఉచితంగా అందించినట్లు" అని ఆయన వెల్లడించారు.

# బీజేపీ-జనసేన పొత్తు కొనసాగుతుంది

విజయవాడ, ఏప్రిల్ 6, బీజేపీ-జనసేన పొత్తుపై కీలక వ్యాఖ్యలు చేశారు బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి పురందేశ్వరి. ఏపీలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ ఆవిర్భావ వేడుకలు ఘనంగా జరిగాయి. జెండావిష్కరించిన పురంధరేశ్వరి విశాఖ ఉక్కు విషయంలో వైసీపీ నాయకులకు బీజేపీని తప్పు పట్టే అర్హత లేదన్నారు. మిత్ర పక్షంగా పవన్ కళ్యాణ్ మాతో చర్చిస్తే.. మేము కూడా స్పందిస్తాం. ఏపీలో కార్యక్రమాలు వేరైనా . బీజేపీ-జనసేన పొత్తు కొనసాగుతుందన్నారు.ఉక్కు ఫ్యాక్టరీ విషయంలో ప్రజల ఆకాంక్షలను కేంద్ర పెద్దలకు వివరిస్తాం. రాష్ట్రంలో అధికార దాహంతో చేసే పనులు ఎలా ఉంటున్నాయో చూస్తున్నాం. సేవ చేయడం కన్నా.. అధికారమే లక్ష్యంతో పని చేస్తున్నాయి. రాష్ట్రంలో పరిస్థితుల్లో మార్పు కావాలని ప్రజలు ఎదురు చుస్తున్నారు. పెట్రోల్, డీజిల్ ఛార్జీల విషయంలో కేంద్రం తన వంతు బాధ్యతగా ధరలు తగ్గించింది. రాష్ట్ర ప్రభుత్వం పన్నుల విషయంలో ఎందుకు తగ్గించడం లేదుఉక్రెయిన్ యుద్ధం వల్ల ఇప్పుడు పెట్రోల్ రేట్లు పెరిగాయి. వైసీపీ పాలనలో అన్ని వ్యవస్థలు నాశనమయ్యాయి. మా ప్రణాళికలు మాకు ఉన్నాయి? వాటికి అనుగుణంగా పని చేస్తాం అన్నారు పురందేశ్వరి. దేశ సేవకి ప్రతి బీజేపీ కార్యకర్త పునరంకితం కావాలని కోరారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో నాలుగు రాష్ట్రాల్లో బీజేపీకి పట్టం కట్టారు.

# కొబ్బరి చిప్పల దొంగకు దేవాదాయశాఖ ఇస్తే..: బుద్దా వెంకన్న



విజయవాడ: మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్‌పై టీడీపీ నేత బుద్దా వెంకన్న తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. కొబ్బరి చిప్పల దొంగకు దేవాదాయ శాఖ ఇస్తే.. కోట్ల రూపాయలు కొల్లగొట్టారని ఆరోపించారు. వెల్లంపల్లిని మంత్రి పదవి నుంచి తొలగించే ముందు ఆయన దోచుకున్న రూ. 1525 కోట్లను సీఎం జగన్ రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. కొబ్బరి చిప్పలు దొంగిలించే వ్యక్తికి దేవాదాయశాఖ మంత్రి పదవి ఇచ్చి జగన్మోహన్ రెడ్డి చరిత్రలో నిలిచిపోయారని, దొంగలకు మంత్రి పదవులు ఇచ్చారని బుద్దా వెంకన్న ఆరోపించారు.

# దేశ సేవకు ప్రతి బీజేపీ కార్యకర్త పునరంకితం కావాలి: పురంధేశ్వరి



విజయవాడ: బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆ పార్టీ నాయకురాలు దగ్గుబాటి పురంధరేశ్వరి అందరికీ శుభాకాంక్షలు చెప్పారు. ఈ సందర్భంగా ఆమె ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ దేశ సేవకు ప్రతి బీజేపీ కార్యకర్త పునరంకితం కావాలని పిలుపిచ్చారు. ఇటీవల జరిగిన ఎన్నికలలో నాలుగు రాష్ట్రాల్లో బీజేపీకి ప్రజలు పట్టం కట్టారన్నారు. ఉత్తరప్రదేశ్‌లో రెండో సారి అధికారం ఇవ్వడం అంటే బీజేపీ పాలనపై ప్రజలకు ఉన్న నమ్మకమని అన్నారు. మోదీ ప్రధానిగా ఎనిమిదేళ్ళ కాలంలో ఎన్నో కార్యక్రమాలు చేపట్టారని, దేశంలో పేదల అభ్యున్నతికి కృషి చేశారన్నారు. ప్రతి కార్యకర్త కూడా పార్టీ గెలుపు కోసం పని చేయాలన్నారు. 'సబ్ కా సాత్, సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్, సబ్ కా ప్రకాశ్' సూత్రంతో ముందుకు వెళుతున్నామన్నారు.రాష్ట్రంలో అధికార దాహం పెరిగిపోయిందని, సేవ చేయడం కన్నా... అధికారమే లక్ష్యంగా పని చేస్తున్నారని పురంధేశ్వరి విమర్శించారు. రాష్ట్రంలో మార్పు కావాలని ప్రజలు ఎదురు చుస్తున్నారన్నారు. పెట్రోల్, డీజిల్ ఛార్జీల విషయంలో కేంద్రం తన వంతు బాధ్యతగా తగ్గించిందని, రాష్ట్ర ప్రభుత్వం పన్నుల విషయంలో ఎందుకు తగ్గించడం లేదని ఆమె ప్రశ్నించారు. ఉక్రెయిన్ యుద్ధం వల్ల ఇప్పుడు పెట్రోల్ రేట్లు పెరిగాయన్నారు. విశాఖ ఉక్కు విషయంలో వైసీపీ నాయకులు బీజేపీ నేతలను తప్పు పట్టే అర్హత లేదన్నారు. మిత్ర పక్షంగా పవన్ కళ్యాణ్ మాతో చర్చిస్తే.. మేము కూడా స్పందిస్తామన్నారు. ఏపీలో కార్యక్రమాలు వేరు అయినా... బీజేపీ, జనసేన పొత్తు కొనసాగుతుందన్నారు. ఉక్కు ఫ్యాక్టరీ విషయంలో ప్రజల ఆకాంక్షలను కేంద్రం పెద్దలకు వివరిస్తామన్నారు. వైసీపీ పాలనలో అన్ని వ్యవస్థలు నాశనం అయ్యాయని విమర్శించారు. తమ ప్రణాళికలు తమకు ఉన్నాయని.. వాటికి అనుగుణంగా పని చేస్తామని పురంధేశ్వరి స్పష్టం చేశారు.

# అవినీతి రహిత పాలనే మా ధ్యేయం: సోము వీర్రాజు



విశాఖపట్నం: బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు విశాఖ ఉత్తర నియోజక వర్గంలో పార్టీ కార్యాలయంలో జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావ దినోత్సవం జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. అవినీతి రహిత పాలనే తమ ధ్యేయమని 'సబ్ కా సాత్...సబ్ కా వికాస్' బీజేపీ లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు విష్ణుకుమార్ రాజు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

# కొత్త జిల్లాలకు కేంద్రీయ విశ్వవిద్యాలయాలు ఇవ్వాలి..

విజయవాడ, ఏప్రిల్ 6, ఏపీలో కొత్తగా 13 జిల్లాలు ఏర్పడిన సంగతి తెలిసిందే. ఈ మేరకు కొత్త జిల్లాల అంశాన్ని వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి రాజ్యసభలో ప్రస్తావించారు. కేంద్రం మార్గదర్శకాల ప్రకారం ప్రతి జిల్లాలో ఓ కేంద్రీయ విద్యాలయం ఉండాలనే విషయాన్ని ఆయన రాజ్యసభలో కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఏపీలో ఏర్పడిన కొత్త జిల్లాలకు కేంద్రీయ విశ్వవిద్యాలయాలను మంజూరు చేయాలని వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి డిమాండ్ చేశారు. కేంద్రీయ విశ్వవిద్యాలయాల ఏర్పాటుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉందని కూడా ఆయన పేర్కొన్నారు.మరోవైపు ఏపీలో జిల్లాల పునర్ వ్యవస్థీకరణ అత్యంత శాస్త్రీయంగా జరిగిందని వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి స్పష్టం చేశారు. 26 జిల్లాలలో ఒక్కో జిల్లా ఒక్కో ఆణిముత్యంలా అభివృద్ధిని నమోదు చేస్తాయని విజయసాయిరెడ్డి ఆకాంక్షించారు. నాలుగు జిల్లాలకు ఎన్టీఆర్, అల్లూరి, అన్నమయ్య, శ్రీసత్యసాయి పేరిట నామకరణం చేయడం ద్వారా సీఎం జగన్ వారిని చిరస్మరణీయులుగా చేశారని విజయసాయిరెడ్డి ప్రశంసించారు.

# ఈ నెల 8న సీఎం పర్యటన కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

- ముఖ్యమంత్రి కార్యక్రమాల కోఆర్డినేటర్ తలశిల రఘురాంతో కలిసి అధికారులతో సమీక్షజిల్లా కలెక్టర్ డా. మనజీర్ జిలాని సామూన్

నంద్యాల, ఏప్రిల్ 05 ( విభారె) :-ఈ నెల 8వ తేదీ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి జిల్లా మొదటి పర్యటనను ఛాలెంజ్ గా తీసుకొని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డా. మనజీర్ జిలాని సామూన్, ముఖ్యమంత్రి కార్యక్రమాల కోఆర్డినేటర్ తలశిల రఘురాంలు అధికారులను ఆదేశించారు. మంగళవారం వైఎస్సార్ సెంటినరీ హాలులో రాష్ట్ర ముఖ్యమంత్రి జిల్లా పర్యటన ఏర్పాట్లపై ముఖ్యమంత్రి కార్యక్రమాల కోఆర్డినేటర్ తలశిల రఘురాంతో కలిసి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొదటిసారిగా నంద్యాల జిల్లాకు వస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు లేకుండా అన్ని రకాల ముందస్తు జాగ్రత్తలు తీసుకుని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో హెలిపాడ్ మైదానం, బహిరంగసభ నిర్వహించే ఎస్పీజీ గ్రౌండ్లో పారిశుద్ధ్య పనులు చేపట్టి దుమ్ము లేయకుండా అధికంగా వాటర్ స్ప్రింక్లర్ చేయాలని మున్సిపల్ కమిషనర్ వెంకటకృష్ణ, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారిని ఆదేశించారు. అలాగే బహిరంగ సభకు హాజరయ్యే ప్రజానీకానికి త్రాగు నీటి వసతి, మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్, ఆర్డబ్ల్యూఎస్ అధికారులను సూచించారు. నగర సుందరీకరణతో పాటు పార్కింగ్ ప్రదేశాలు, సీఎం పర్యటించే ప్రదేశాల్లో వంద శాతం పారిశుద్ధ్య పనులు చేపట్టడంతో పాటు రోడ్ డివైడర్ లకు రంగులు వేయాలని మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. హెలిప్యాడ్ ల్యాండ్ అయ్యే ప్రదేశంలో ఏ సమస్య రాకుండా పోలీసు అధికారులను కోఆర్డినేట్ చేసుకొని ఏర్పాటు చేసుకోవాలని ల్యాండ్ అండ్ సర్వే ఎడిని ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటించే ప్రదేశాల్లో విద్యుత్ అంతరాయం లేకుండా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని ఏపీఎస్పిడిసిఎల్ అధికారులను ఆదేశించారు. హెలిప్యాడ్, బహిరంగ సభ వేదిక సమీపాల్లో సేఫ్ రూములు ఏర్పాటు చేసుకొని అత్యవసర మందులతో సిద్ధంగా వుండాలని డిఎంహెచ్ఓ, జిల్లా ఆసుపత్రి వైద్యాధికారులను ఆదేశించారు.రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనకు జెడ్ ప్లస్ కేటగిరితో పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని జిల్లా ఎస్పీ కె. రఘువీరారెడ్డిని కలెక్టర్ ఆదేశించారు. సిఎం పర్యటించే ప్రదేశాల్లో డబుల్ లేయర్ తో కూడిన బారికేడింగ్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి మాట్లాడుతూ నంద్యాల జిల్లాగా ఏర్పాటైన తర్వాత కమొుట్టమొదటిసారిగా జిల్లా పర్యటనకు వస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున జయప్రదం చేసేందుకు అధికారులు అందరూ సమన్వయంతో కలసికట్టుగా పని చేయాలని సూచించారు. మనకంటూ గుర్తింపు తెచ్చుకునేందుకు మంచి అవకాశం వచ్చిందని అధికారులు అందరూ తమకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వహించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఎన్నికలకు ముందు ఇదే వేదిక నుండి నంద్యాల పార్లమెంటును జిల్లాగా చేస్తానని సీఎం వాగ్దానం చేశారని.... జిల్లా అయిన తర్వాత మొదటిసారిగా జిల్లాకు వచ్చి జగనన్న వసతి దీవెన కార్యక్రమంలో పాల్గొంటున్న నేపథ్యంలో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.నంద్యాల పార్లమెంటు సభ్యులు పోచా బ్రహ్మానంద రెడ్డి, ప్రభుత్వ విప్ గంగుల ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్సీ ఈషాక్ బాషా, ఎమ్మెల్యేలు శిల్పరవిచంద్ర కిషోర్ రెడ్డి, శిల్పా చక్రపాణి రెడ్డి, తోగూర్ ఆర్థర్, మార్కెఫెడ్ చైర్మన్ పి.పి.నాగిరెడ్డి, జాయింట్ కలెక్టర్ నారపరెడ్డి మౌర్య, జేసీ (ఆసరా మరియు సంక్షేమం) ఎంకెవి శ్రీనివాసులు,డిఆర్ఓ పుల్లయ్య, ఆర్డీఓ శ్రీనివాసులు, జిల్లాధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టరు

కర్నూలు:- కల్లూరు మండలం, పర్ల గ్రామ సచివాలయం 1 మరియు 2 లను జిల్లా కలెక్టరు కోటేశ్వరరావు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయంలో సిబ్బంది హాజరు పట్టిక, ఉద్యోగుల మూమెంట్ రిజిస్టర్, సంక్షేమ పథకాల క్యాలెండర్, ఎస్ఎల్ఏ గడువులోగా ప్రజా సమస్యల పరిష్కార చర్యల నివేదిక తదితర రికార్డులను పరిశీలించారు సచివాలయ సిబ్బంది ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి తెలియజేస్తున్నారా... అందుబాటులో ఉంటున్నారా.... అని గ్రామస్థులతో ఆరా తీశారు. ఏమైనా సమస్యలు ఉంటే సచివాలయంలో తెలియజేయాలని గ్రామస్థులకు కలెక్టర్ సూచించారు



# భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవం...

నందికొట్కూర్ ఏప్రిల్ 05 ( విభారె) :- నందికొట్కూరు నియోజకవర్గం.నందికొట్కూరు పట్టణంలో బైరెడ్డి స్వగృహంలో భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమం నందికొట్కూరు పట్టణ అధ్యక్షుడు గూడూరు రవికుమార్ రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా భారతీయజనతా యూవ మోర్చ రాష్ట్రప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరిరెడ్డిగ పాల్గొని భారతీయ జనతా పార్టీ జెండా ఆవిష్కరించారు. అనంతరం ప్రధానిమోదీగారిలైవ్ వీక్షించారు. సందర్భంగా బైరెడ్డి శబరి మాట్లాడుతూ 4 దశాబ్దాలుగా భారతీయ జనతా పార్టీ ఈ దేశం కోసం ప్రజల కోసం అనేక పోరాటాలు చేసిందని అలాగే భారతీయ జనతా పార్టీని ఈ స్థాయికి చేర్చిన ఎందరో మహానుభావులు వారి జీవితాలను త్యాగం చేశారని భారతీయ జనతా పార్టీలో ప్రతి కార్యకర్త దేశం కోసం ధర్మం కోసం నిజాయితీ నిబద్ధత తో ఉంటారని వారు అన్నారు. అలాగే కార్యకర్తలు పార్టీ బలోపేతం చేసేందుకు వెనకడుగు వేస్తే శహించేది లేదు అని కాస్త ఘాటుగానే కార్యకర్తలను హెచ్చరించారు.భారతీయ జనతా పార్టీని బూత్ స్థాయి నుండి బలోపేతం చేయాలని కార్యకర్తలకు సలహాలు సూచనలు ఇచ్చారు. అదేవిధంగా నందికొట్కూరు పట్టణ భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు గూడూరు రవి కుమార్ రెడ్డి భారతీయ జనతా పార్టీ ఒక పెద్ద కుటుంబం లాంటిదని భారతీయ జనతా పార్టీ కోసం వాటిని ముందుకు తీసుకెళ్లేందుకు కష్టపడి నటువంటి వారికి ఖచ్చితంగా మంచి గుర్తింపు ఉంటుందని కావున ప్రతి ఒక్కరూ డాక్టర్ బైరెడ్డి శభరి సారథ్యంలో పనిచేసేందుకు వెనకడుగు వేసేది లేదని రవి కుమార్ రెడ్డి ఈ సందర్భంగా తెలియజేశారు. అందుకు మనమందరం కలిసి చేయి..చేయి కలిపి పార్టీ కోసం పని చేద్దామని అన్నారు. ఈ కార్యక్రమంలో నందికొట్కూరు పట్టణ ప్రధాన కార్యదర్శి బి సురేష్ . చిన్న సుంకన్న .రమణా .శ్రీకాంత్ రావ్ . రాంచెంద్రుడు .హనుమంతు .గోపాల్.సీ డి అంజినాయులు . ఉషన్ రెడ్డి .సిల్వెరి వెంకటేష్ . నాగరాజు . నాగేంద్ర . అశ్విన్ కుమార్ .చిన్న . శివ . బిజెపి తదితరులు పెద్ద ఎత్తున పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

### అబ్బరాతి వీధి వాలంటీర్లను అభినందించిన ఎమ్మెల్యే డాక్టర్ సుధా

బద్వేలు ఏప్రిల్ 05 ( విభారె) ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాదయాత్ర లో ప్రజల్లో మమేకమైన సందర్భాలలో అట్టడుగు ప్రాంత ప్రజలకు, కొంతమంది చదువు లేని ప్రజలకు ప్రభుత్వ పథకాలు అర్హులు అయిన కూడా అవి వారికి అందడం లేదు అనే విషయం గ్రహించి మన ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం అందించే ప్రతి ప్రభుత్వ పథకాన్ని అన్ని వారి ఇంటి వద్ద నుంచే లబ్ధి పొందేటట్లు చేయాలన్న ఉద్దేశంతో ఈ వాలెంటర్ వ్యవస్థని ప్రారంభించారని డాక్టర్ సుధా అన్నారు .ప్రజలకు ఎటువంటి సమస్య వచ్చినా ప్రతి నిత్యం వారు వెంటనే ఉంటూ వారికి అన్నివేళలా తోడుంటూ వారి సమస్యను మీ సమస్యగా భావించి ఆ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నా అబ్బరాతి వీధి వాలంటీర్లను డాక్టర్ సుధా అభినందించడం జరిగింది.. ఈ కార్యక్రమంలో వాలంటరీ సుకుమార్ , వెంకటసుబ్బయ్య, శంకర్, సుధా, అరుణ,శిరీష తదితరులు పాల్గొన్నారు.. ఇటువంటి గొప్ప అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి వారి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు

## పాదా చారికి దారేది?

ఆక్రమించుకొని వ్యాపారాలు

నంద్యాలఏప్రిల్ 05 ( విభారె) నంద్యాల పట్టణంలో పుట్ పాత్ లు ఆక్రమణలకు గురవడంతో పాదాచారులు నడిచేందుకు దారి లేక రోడ్లపైనే తిరగాల్సి వస్తోంది. నూనెపల్లె నుండి ఒకటవ పట్టణ స్టేషన్ వరకు. గవర్నమెంట్ ఆసుపత్రి నుంచి పొన్నాపురం వరకు. శ్రీనివాస్ సెంటర్ నుండి బస్టాండ్ వరకు . పుట్ పాత్ పై వ్యాపారులు కొనసాగిస్తున్నారు. అ పక్కనే వాహనాలు కూడా పార్కింగ్ చేస్తుండడంతో మరిన్ని ఇక్కట్లు ఎదురవుతున్నాయి. రోడ్డు మీద నడుస్తామంటే వాహనాలు ఎక్కడ తగిలిస్తారోనని భయం . మున్సిపల్ అధికారులు అక్రమణలు తొలగిస్తామని ప్రకటనలకే సరిపుచ్చారు. ఆచరణలో అమలు కావడం లేదు.

## ప్రధాన కూడళ్లలో చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలి

సీపీఐ పట్టణ కార్యదర్శి కె ప్రసాద్

నంద్యాల ఏప్రిల్ 05 ( విభారె)నంద్యాల పట్టణంలోని ప్రధాన కూడళ్లలో మున్సిపల్ అధికారులు చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలని సిపిఐ పట్టణ కార్యదర్శి కె ప్రసాద్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అనంతరం మాట్లాడుతూ నంద్యాల ను జిల్లాగా మార్చడం వలన చుట్టుపక్కల మండలాల నుంచి గ్రామాల నుంచి వాహనదారుల తో పట్టణములో రద్దీ పెరుగుతుందని ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ సిగ్నల్ లైట్లు లేవని అన్నారు . గంటల కొద్ది ట్రాఫిక్ జంక్షన్ల దగ్గర వాహనాలలో ప్రయాణం చేసే మహిళలు పిల్లలు వృద్ధులు అనేక ఇబ్బందులకు గురి అవుతున్నారని అన్నారు. వడదెబ్బ తగిలే ప్రమాదం కూడా ఉందని ఎండలు ఇప్పటికే 41 డిగ్రీలు దాటడం జరిగిందని కనుక వెంటనే అధికారులు ప్రధాన కూడళ్లలో చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలని సిపిఐ పట్టణ కార్యదర్శి కె ప్రసాద్ తెలియజేశారు.

### సిమెంట్ రోడ్డు పనులకు భూమి పూజ చేసిన ఎమ్మెల్యే ఎమ్మెల్సీ

బద్వేలు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి బద్వేలు మున్సిపాలిటీ అభివృద్ధికి ఇచ్చిన 130 కోట్ల నిధులకు గాను 5వ వార్డుకు సంబంధించి 98 లక్షల పనులకు సంబందించి వైస్సార్సీపీ సీనియర్ నాయకులు సింగసాని శివయ్య ఆధ్వర్యంలో బుధవారం శాసనమండలి సభ్యులు డీసీ.గోవిందరెడ్డి , శాసనసభ్యులు డా. సుధా మునిసిపల్ చైర్మన్ వకముల్లా రాజగోపాల్ రెడ్డి చేతుల మీదుగా నాగుల చెరువు కట్ట( సచివాలయం దగ్గర) సీసీ రోడ్లకు భూమి పూజ నిర్వహించారు,ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె వి కృష్ణారెడ్డి మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ రమణ రెడ్డి సుందర్రామిరెడ్డి వార్డ్ కౌన్సిలర్ గుర్రం రత్నమ్మ వైసీపీ నాయకులు యద్ద రెడ్డి, పూతా శ్రీరాములు,సింగసాని రాజేష్,అనిల్ కుమార్ రాజు,ఆవుల శ్రీనివాసులు,ఓబుల్ రెడ్డి,వెంకటరత్నం యాదవ్,వైసీపీ నాయకులు కౌన్సిలర్లు,ఇన్చార్జులు కార్యకర్తలు పాల్గొన్నారు

# శంకర్ పెడుతున్న ఖర్చుతో మెగా ఫ్యాన్స్ ఫుల్ హ్యాపీ




మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా శంకర్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతున్న విషయం తెల్సిందే. ఆర్ ఆర్ ఆర్ విడుదలకు ముందే ప్రారంభం అయిన ఆర్ సీ 15 చిత్రం యొక్క షూటింగ్ కు సంబంధించిన అప్డేట్ ఒకటి సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. ఇటీవల ఒక పాట చిత్రీకరణ పూర్తి చేశారట. రామోజీ ఫిల్మ్ సిటీలో ప్రత్యేకంగా వేసిన సెట్ లో ఈ సినిమాను షూట్ చేశారట.విశ్వసనీయంగా అందుతున్న సమాచారం ప్రకారం ఆ పాట కోసం దర్శకుడు శంకర్ దాదాపుగా 9 కోట్లకు పైగా ఖర్చు చేశాడట. ఆ స్థాయి ఖర్చు శంకర్ సినిమాలకు చాలా సాదారణ విషయం. భారీ బడ్జెట్ చిత్రాలకు కేరాఫ్ అడ్రస్ అయిన శంకర్ ప్రస్తుతం అంతకు మించి అన్నట్లుగా ఈ సినిమాను చేస్తున్నాడు. రికార్డు స్థాయి బడ్జెట్ తో ఈ సినిమా ను దిల్ రాజు నిర్మిస్తున్న విషయం తెల్సిందే.మొన్న పాట గురించి చర్చ జరిగింది. ఇప్పుడు ఫైట్ కు సంబంధించిన వార్తలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. చిత్ర యూనిట్ సభ్యుల నుండి అందుతున్న సమాచారం ప్రకారం ఒక ఫైట్ సీక్వెన్స్ కు సంబంధించి శంకర్ ఏకంగా 10 కోట్లు ఖర్చు చేశాడట. వీఎఫ్ఎక్స్ వర్క్ ఉపయోగించకుండా చాలా నాచురల్ గా ఉండేందుకు గాను ఫైట్ సన్నివేశం కోసం ఆ స్థాయి లో ఖర్చు చేసినట్లుగా తెలుస్తోంది.సినిమా గురించి మీడియాలో వస్తున్న ఈ పుకార్లు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ నేపథ్యంలో మెగా అభిమానులు సినిమాపై అంతకంతకు అన్నట్లుగా అంచనాలు పెంచేసుకుంటున్నారు. ఈమధ్య కాలంలో శంకర్ నుండి గొప్ప సినిమాలు రాలేదు. కొన్ని వివాదాలు.. మరి కొన్ని ప్రయోగాల కారణంగా ఆయన నుండి రెగ్యులర్ కమర్షియల్ సినిమాలను ఆయన నుండి ప్రేక్షకులు చూడలేక పోయారు.ఇప్పుడు రామ్ చరణ్ తో శంకర్ సినిమా చేస్తున్న నేపథ్యంలో తమిళం మరియు తెలుగు ఆడియన్స్ లో ఖచ్చితంగా అంచనాలు పీక్స్ లో ఉంటాయి. ఏమాత్రం అనుమానం లేకుండా శంకర్ ఈ సినిమా కోసం కాస్త ఎక్కువగానే ఖర్చు పెట్టిస్తాడని ఇన్నాళ్లు అంతా అనుకున్నారు. కేవలం ఒక ఫైట్ మరియు పాట కోసం 20 కోట్ల రూపాయలను ఖర్చు చేయడం అంటే మామూలు విషయం కాదు. కనుక ఖచ్చితంగా శంకర్ గట్టిగానే దిల్ రాజు తో పెట్టిస్తున్నాడు అంటూ మెగా అభిమానులు ఫుల్ హ్యాపీ ఫీల్ అవుతున్నారు.

# బాక్సర్ 'గని' స్క్రీనింగ్ పాత ధరలతోనే!

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ కథానాయకుడిగా నటించిన 'గని' వాయిదాల మీద వాయిదాలు పడి ఎట్టకేలకుల ఈనెల 8న రిలీజ్ అవుతోన్న సంగతి తెలిసిందే. భారీ అంచనాల మధ్య చిత్రం ప్రేక్షకుల ముందుకొస్తుంది. వరుణ్ ఫాం...'గని'లో బాక్సర్ గా నటించడం సహా ప్రచార చిత్రాలు సినిమాపై భారీ అంచనాల్ని క్రియేట్ చేసాయి. ఫస్ట్ లుక్ పోస్టర్ తోనే దర్శకుడు కిరణ్ కొర్రపాటి సరికొత్త వరుణ్ వెండి తెరపై ఆవిష్కరిస్తున్నాడని తేలిపోయింది. అటుపై రిలీజ్ అయిన టీజర్..ట్రైలర్ వరుణ్ క్యారక్టరైజేషన్ ని మరింత హైలైట్ చేసాయి. దాదాపు 35 కోట్ల రూపాయల బడ్జెట్ తో నిర్మించారు. వరుణ్ కెరీర్ లో ఇప్పటివరకూ ఇదే బారీ బడ్జెట్ చిత్రం కూడా. ఇదే సినిమాతో అల్లు అరవింద్ పెద్ద కుమారెఉడు బాబి నిర్మాతగా పరిచయం అవుతున్నాడు. ఇందులో ఆయన కీలక పాత్రధారిగా చెప్పొచ్చు. దీంతో నిర్మాతలు ఎంత నమ్మకంతో ఇంత బడ్జెట్ కేటాయించారో అంచనా వేయొచ్చు. ఇలా ఎన్నో విశేషాలు 'గని'లో ఉన్నాయి.ఇక అన్ని పనులు పూర్తి చేసుకుని ఈనెల 8న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. అయితే ఈసినిమా తెలంగాణలో పాత టిక్కెట్ ధరలతోనే రిలీజ్ అవుతుంది. మల్టీప్లెక్స్ లో 200 రూపాయలు..జీఎస్టీ పే చేయాలి. సింగిల్ స్క్రీన్ థియేటర్లలో 150-జీఎస్టీ పే చేయాలి. దీంతో ఈ సినిమా విషయంలో ఎలాంటి మినహాయింపులు లేవని తెలుస్తోంది. తెలంగాణలో కేవలం పాత ధరలతోనే రిలీజ్ అవుతుంది. ఇక ఏపీలోప్రస్తుతం ఉన్న ధరలతోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. స్టార్ హీరోల సినిమాలకు..భారీ బడ్జెట్ సినిమాలకు టిక్కెట్ ధరలు పెంచుకునే వెసులుబాటు రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు కల్పించాయి. దానికి కొన్ని పరిమితిలు కూడా ఉన్నాయి. మరి ఆ కోటాలోకి వరుణ్ తేజ్ ఇంకా చేరినట్లు లేదు. అందుకే పాత ధరలతోనే గని రిలీజ్ అవుతుంది. ఇటీవలే 'ఆర్ ఆర్ ఆర్' టిక్కెట్ ధరతో ప్రేక్షకుడి నడ్డి విరిగిపోయింది.సినిమా వీరాభిమానులంతా 400 రూపాయలు వెచ్చించి 'ఆర్ ఆర్ ఆర్' వీక్షించి ఆనందపడ్డారు. ఈ నేపథ్యంలో కొంత వ్యతిరేకత వ్యక్తమైంది. ఓసెక్షన్ ఆడియన్స్ 'ఆర్ ఆర్ ఆర్' పై మండిపడ్డారు. ఆ కారణంగానూ 'గని' నిర్మాతలు రాష్ట్ర ప్రభుత్వాల ముందుకు టిక్కెట్ ధర పెంచుకుంటామని వెళ్లి ఉండకపోవచ్చని మరోవైపు టాక్ వినిపిస్తుంది. కారణాలు ఏవైనా 'గని' తెలంగాణలో పాత ధరలతో ప్రేక్షకుల ముందుకు రావడం సంతోషకరమైన విషయంగా అభిమానులు భావిస్తున్నారు.




# 'అహ నా పెళ్ళంట' తో ఓటీటీలో ఎంట్రీ ఇస్తోన్న రాజ్ తరుణ్ - శివానీ రాజశేఖర్..!

తెలుగులోనూ వెబ్ సిరీస్ ల సందడి కొనసాగుతుండటంతో పాపులర్ స్టార్స్ సైతం ఓటీటీ స్క్రీన్ లపై కనిపించడానికి ఆసక్తి కనబరుస్తున్నారు. వెబ్ ఓటీటీ కంటెంట్ లో ప్రయోగాలు చేయడానికి ఎలాంటి అవధులు లేకపోవడం.. విలక్షణమైన పాత్రల్లో నటించే ఛాన్స్ వస్తుండంతో అందరూ ఆ దిశగా అడుగులు వేస్తున్నారు.అలానే సినిమాల్లో అవకాశాలు తగ్గిన వారికి కూడా ఓటీటీలు సెకండ్ ఆప్షన్ గా కనిపిస్తున్నాయి. ఇటీవల కాలంలో అనేక మంది టాలీవుడ్ నటీనటులు వెబ్ సిరీస్ లలో నటించారు. ఈ క్రమంలో తాజాగా రాజ్ తరుణ్ - శివాని రాజశేఖర్ కూడా డిజిటల్ ఎంట్రీకి సిద్ధమయ్యారు.ప్రముఖ ఓటీటీ ఫ్లాట్ ఫార్మ్ జిఇఇ5 రూపొందించే "అహ నా పెళ్ళంట" అనే ఒరిజినల్ వెబ్ సిరీస్ లో రాజ్ తరుణ్ - శివాని రాజశేఖర్ భాగం అవుతున్నారు. ఆదివారం ఈ వెబ్ సిరీస్ ను రాజమండ్రిలోని గరిమెళ్ల సత్యనారాయణ ట్రైనింగ్ కాలేజ్ లో పూజా కార్యక్రమాలతో లాంఛనంగా ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి ప్రధాన నటీనటులతో పాటుగా ఎంపీ మార్గాని భరత్ - మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ - చందన నాగేశ్వరావ్ - కందుల దుర్గేష్ - ఆదిరెడ్డి వాసు - గాదంశెట్టి శ్రీధర్ మరియు జీ5 నుంచి పూర్ణ ప్రజ్ఞ - రాధ కృష్ణవేణి తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఎన్నో ఏళ్లుగా పెళ్ళి కోసం ఎదురు చూసి ఓ యువకుడు ఎట్టకేలకు పెళ్లి పీటలెక్కిన తర్వాత.. తాళి కట్టే సమయంలో పెళ్లి కూతురు తన బాయ్ ఫ్రెండ్ తో లేచిపోవడంతో వారిద్దరిపై ఆ పెళ్లి కొడుకు ఎలాంటి ప్రతీకారం తీర్చుకున్నాడు అనే కథంతో కామెడీ రొమాన్స్ ఎంటర్టైనర్ గా "అహ నా పెళ్ళంట" తెరకెక్కుతోంది. ఇందులో రాజ్ తరుణ్ - శివాని రాజశేఖర్ జంటగా నటిస్తుండగా.. ఆమని - హర్షవర్ధన్ - పోసాని కృష్ణమురళి తదితరులు కీలక పాత్రలు పోషించనున్నారు. నగేష్ బన్నెల సినిమాటోగ్రఫి అందిస్తుండగా.. జాదుహా శాండి సంగీతం సమకూరుస్తున్నారు. కథ - స్క్రీన్ ప్లే దావూద్ అందించగా.. కళ్యాణ్ రాఘవ మాటలు రాస్తున్నారు.'ఏబీసీడీ' ఫేమ్ సంజీవ్ రెడ్డి ఈ సిరీస్ కు దర్శకత్వం వహిస్తున్నారు. రాహుల్ తమాడ - సాయిదీప్ రెడ్డి బొర్రా నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. 'అహ నా పెళ్ళంట' పూజా కార్యక్రమాల అనంతరం జిఇఇ5 మరియు తమడ మీడియా ప్రతినిధులు మాట్లాడుతూ.. ఈ వెబ్ సిరీస్ కు సంబంధించిన వివరాలు వెల్లడించారు."రాజ్ తరుణ్ తొలిసారిగా వెబ్ కంటెంట్ లో నటించడం వెబ్ సిరీస్ లకు ప్రజల్లో ఉన్న ఆదరణకు నిదర్శనం. ఈ మధ్య కాలంలో అన్ని భాషల్లోని హీరోలు సైతం వెబ్ సిరీస్ లలో నటించడానికి ఆసక్తిని కనబరుస్తున్నారు. మొన్న నటుడు సుశాంత్ మంచి కంటెంట్ ఉన్న వెబ్ సిరీస్ లో నటించడానికి ముందుకు రాగా.. ఇప్పుడు రాజ్ తరుణ్ ముందుకు రావడం చాలా సంతోషంగా ఉంది" అని పేర్కొన్నారు."ప్రేమలోని కొత్త కోణాన్ని ఆవిష్కరించే సరికొత్త ప్రేమ కథ ఇది. అందరినీ అలరించేలా ఉంటుంది. కామెడీ డ్రామా - రొమాన్స్ తో సాగే 'అహ నా పెళ్ళంట' వెబ్ సిరీస్.. 30 నిముషాల నిడివితో 8 ఎపిసోడ్స్ గా ప్రసారం అవుతుంది. రాజమండ్రి పరిసర ప్రాంతాలలో 15 రోజుల పాటు ఈ షెడ్యూల్ షూటింగ్ జరుపుకుంటుంది" అని మేకర్స్ తెలిపారు.ఈ సందర్భంగా దర్శకుడు సంజీవ్ రెడ్డి మాట్లాడుతూ.. "పెళ్లి రోజున తన బాయ్ ఫ్రెండ్ తో కలిసి పెళ్లి కూతురు లేచిపోతుంది. చేతిలో మంగళ సూత్రం పట్టుకుని ఆమె కోసం మండపంలో పెళ్లి కొడుకు ఎదురు చూస్తూ ఉంటాడు. ఎన్నో ఏళ్లుగా పెళ్లి కోసం ఎదురు చూస్తున్న ఆ అబ్బాయి.. తన జీవితంలో ముఖ్యమైన రోజున అలా జరుగుతుందని ఊహించలేదు.అందుకు కారణమైన అమ్మాయి - అబ్బాయి పై ఆ పెళ్లి కొడుకు ఎలాంటి ప్రతీకారం తీర్చుకోవాలనుకుంటాడు. ఆ తర్వాత ఏమైంది? అనేది 'అహ నా పెళ్ళంట' వెబ్ సిరీస్ లో చూడాలి. జీ5 వంటి పెద్ద సంస్థలో పని చేసే అవకాశం కల్పించినందుకు ప్రత్యేక ధన్యవాదాలు" అని అన్నారు.



## తను బాగా ఆడితే నా కన్న కొడుకే ఆడినంతగా సంబర పడతా: ఎమ్ఎస్కే ప్రసాద్

టీమిండియా ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యాపై భారత జట్టు మాజీ సెలక్టర్ ఎమ్ఎస్కే ప్రసాద్ ప్రశంసలు కురిపించాడు. ఐపీఎల్-2022లో కొత్త జట్టు గుజరాత్ కెప్టెన్‌గా అదరగొడుతున్నాడని, ఆ అనుభవం హార్దిక్ కెరీర్‌కు ఎంతగానో దోహదం చేస్తుందని పేర్కొన్నాడు. మైదానంలో అతడు వ్యవహరిస్తున్న తీరు ముచ్చటగొలుపుతోందన్నాడు. భావోద్వేగాలకు అతీతంగా హుందాగా ప్రవర్తిస్తూ మానసికంగా పరిణతి చెందుతున్నాడని కొనియాడాడు.కాగా హార్దిక్ పాండ్యా 2016లో భారత జట్టుకు ఎంపిక కావడంలో ఎమ్ఎస్కే ప్రసాద్ పాత్ర మరువలేనిది. వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకున్న హార్దిక్ స్టార్ ఆల్‌రౌండర్‌గా ఎదిగాడు. అయితే, గతేడాది నుంచి ఫామ్‌లేమితో సతమతమవడం, బౌలింగ్ చేయలేకపోవడం వంటి పరిణామాల నేపథ్యంలో జాతీయ క్రికెట్ అకాడమీలో హార్దిక్ శిక్షణ పొందాడు.బీసీసీఐ నుంచి పిలుపు రాకపోవడం సహా ఐపీఎల్‌లో తనను ప్రోత్సహించిన ముంబై ఇండియన్స్ కూడా రిటైన్ చేసుకోకపోవడంతో హార్దిక్ కెరీర్ మసకబారుతోందంటూ కామెంట్లు వినిపించాయి. ఈ నేపథ్యంలో కొత్త ఫ్రాంఛైజీ గుజరాత్ టైటాన్స్ అతడిని కొనుగోలు చేసి తమ జట్టు సారథిగా నియమించింది. ఇక సారథిగా హార్దిక్‌కు ఇదే తొలి అనుభవం.అయినప్పటికీ ఆడిన తొలి రెండు మ్యాచ్‌లలో తనదైన ముద్ర వేసి హార్దిక్ జట్టుకు వరుస విజయాలు అందించాడు. లక్నో, ఢిల్లీ జట్లపై గెలుపుతో సారథిగా శుభారంభం అందుకున్నాడు. ఢిల్లీతో మ్యాచ్‌లో 31 పరుగులు, లక్నోపై 33 పరుగులు సాధించి బ్యాటర్‌గా ఫర్వాలేదనిపించాడు. ఈ క్రమంలో బొరియా మజుందార్ యూట్యూబ్ చానెల్‌లో ఎమ్ఎస్కే ప్రసాద్ మాట్లాడుతూ హార్దిక్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు."తను బాగా ఆడితే... నాకు అది గర్వకారణం. ఆ విజయం అన్నంతగా సంబరపడతా. దిగ్గజ ఆల్‌రౌండర్ కపిల్ దేవ్ వారసత్వాన్ని కొనసాగించగల ఆల్‌రౌండ్ ప్రతిభను వెలికితీయడం అంటే చాలా కష్టంతో కూడుకున్న పని. అయితే, ఈ యంగ్‌స్టర్‌లో నేను ఆ లక్షణాలు చూశాను. బౌలింగ్, బ్యాటింగ్, ఫీల్డింగ్.. ఇలా అన్ని విభాగాల్లో అతడు స్ట్రాంగ్.ఇప్పుడు తను వ్యక్తిగతంగా, ఆటగాడిగా మరింత పరిణతి చెందాడు. తనకు పెళ్లైంది. జీవితంలో సెటిలయ్యాడు. గుజరాత్ టైటాన్స్ కెప్టెన్ అయ్యాడు. ఈ అనుభవం తనను మరో స్థాయికి తీసుకువెళ్తుంది. భారత జట్టుకు కూడా ఉపయోగకరంగా ఉంటుంది. ఫీల్డ్‌లో హార్దిక్ వ్యవహరిస్తున్న తీరును చూస్తుంటే ముచ్చటేస్తోంది" అని హార్దిక్ పాండ్యాపై ప్రశంసల వర్షం కురిపించాడు. కాగా ఏప్రిల్ 8న పంజాబ్ కింగ్స్‌తో గుజరాత్ తమ తదుపరి మ్యాచ్ ఆడనుంది. ఇక గుజరాత్ టైటాన్స్ సారథ్య బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో భావోద్వేగానికి గురైన హార్దిక్.. జట్టును అత్యున్నత శిఖరాలకు చేరుస్తానంటూ అభిమానులకు మాట ఇచ్చిన సంగతి తెలిసిందే.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190